జూన్ 2022

రు. 20/

సంకల్ప బలం

సామాజిక విలువల మాసపత్రిక



RNI No. APTEL/2011/39497 JUNE 2022 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication:1st June Date of Posting:8th June




32 జిల్లాల్లో నూతన జిల్లా కోర్టుల ప్రారంభం



తెలంగాణా ఆవిర్భావం దినోత్సవం
అమరవీరుల స్థూపం వద్ద ముఖ్యమంత్రి




చైతన్యం సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

జూన్ 2022

సంపుటి -11 సంచిక - 9



వ్యవస్థాపక సంపాదకురాలు

తీగవరపు శాంతి


## ఈ సంచికలో....


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| గురుశిష్యులు | 8 |
| గ్రీసు దేశపు పురాణ గాథలు | 10 |
| సింహళ యాత్రా వైభవం | 18 |
| 116 కందాల్లో సుందరకాండ | 25 |
| దేవదేవుని పంచభూతలింగాలు | 27 |
| భాగవత వీక్షణం | 34 |
| నందిని సిధారెడ్డి | 37 |
| సంస్కృత సాహిత్యంలో రిపార్టీ ప్రక్రియ | 45 |
| నైవేద్యం | 50 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

ఘనంగా తెలంగాణా అవతరణ దినోత్సవ వేడుకలు - ఏ రాష్ట్రం సాధించని విజయాలు తెలంగాణా సొంతం

ఎనిమిదేళ్ల కాలంలో తెలంగాణా రాష్ట్రం ఎంతో పురోగతి సాధించిందని అభివృద్ధిలో శిఖరాగ్రాన ఉందని తెలంగాణా ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. తెలంగాణా రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పబ్లిక్ గార్డెన్స్ లో నిర్వహించిన వేడుకల్లో కేసీఆర్ మాట్లాడుతూ, 75 సంవత్సరాల్లో దేశంలో ఏ రాష్ట్రం సాధించని విజయాలను తెలంగాణా ఈ ఎనిమిదేళ్లలో సాధించి చూపించిందన్నారు. అభివృద్ధిలో శిఖరాగ్రానికి చేరి ప్రపంచం ముందు సగర్వంగా నిలిచిందని పేర్కొన్నారు.

జిల్లాల్లో ఘనంగా తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ...

తెలంగాణా వ్యాప్తంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకుంది ప్రభుత్వం. జిల్లా కేంద్రాల్లో ఇన్ - చార్జి మంత్రులు జాతీయ జెండాను ఎగుర వేసి రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించారు.

దేశానికే ఆదర్శంగా తెలంగాణా .... రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్ ..

తెలంగాణా రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు కేటీఆర్. రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో పాల్గొన్న ఆయన ... తెలంగాణా రాష్ట్రం అన్ని రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. నాలుగు కోట్ల ప్రజల ఉద్యమ ఫలితమే ఈ మన తెలంగాణా అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ అన్నారు. ఎందరో అమరుల బలిదానం, నాలుగు కోట్ల ప్రజల ఉద్యమ ఫలితమే ఈ మన తెలంగాణ అని తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ అన్నారు. తెలంగాణా ప్రజలకు భారత రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ శుభాకాంక్షలు అందజేశారు. అలాగే తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా తెలంగాణా ప్రజలకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. రాజభవన్ లోను తెలంగాణా అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. రాష్ట్ర ప్రజలకు ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపారు. పలు రంగాల్లో రాణిస్తున్న వారికి పురస్కారాలు అందజేశారు.

ఎఫ్ సీ ఐ బియ్యం సేకరణ నిలిపివేత

తెలంగాణా నుండి భారత ఆహార సంస్థ బియ్యం సేకరణను నిలిపి వేసింది. అందుకు కారణాలను పేర్కొంటూ రాష్ట్ర పౌర సరఫరాల శాఖకు లేఖ రాయడం సంచలనంగా మారింది. మిల్లుల్లో నిల్వలు లేవు. పైగా కొన్ని చోట్ల నిల్వలున్నా లెక్కించేందుకు వీలుగా లేవు. అక్రమాలకు పాల్పడిన మిల్లులపై చర్యలు తీసుకోవలసిందిగా లేఖలు వ్రాసినా స్పందన లేదు. కరోనా సమయంలో కేంద్రం పేదలందరికీ బియ్యం ఉచితంగా ఇస్తోంది. రాష్ట్రంలో ఆ బియ్యం పంపిణీ రెండు నెలలుగా జరగడం లేదు. ఈ నేపథ్యంలోనే బియ్యం సేకరణ ప్రస్తుతానికి నిలిపి వేస్తున్నాం అంటూ ఎఫ్ సీ ఐ తెలంగాణా సర్కారుకు లేఖ వ్రాసింది. పౌర సరఫరాల శాఖా మంత్రి గంగుల కమలాకర్ ఎఫ్ సి ఐ వ్రాసిన లేఖపై స్పందిస్తూ 2020 ఏప్రిల్ నుంచీ 2021 నవంబరు వరకు 8 నెలలు గరీబ్ యోజనకు అనుగుణంగా కేంద్రం ఇచ్చే ఉచిత బియ్యం తో పాటు రాష్ట్ర ప్రభుత్వం 5 కిలోల బియ్యం ఉచితంగా ఇచ్చింది. రాష్ట్రంలో 90. 46 లక్షల రేషను కార్డులు ఉంటే 53 లక్షల కార్డులను మాత్రమే కేంద్రం గుర్తించింది. మిగిలిన కార్డు దారులకు రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా ఇస్తోంది. ధాన్యం సేకరణ పనుల వల్లే ఉచిత బియ్యం పంపిణీ మే నెలలో ఆలస్యమైంది. జూన్ నుంచి ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నాం అని మంత్రి కమలాకర్ స్పందించారు.

ఆర్టీసీ ప్రయాణీకులపై మరోసారి బాదుడు

ఆర్టీసీ తెలంగాణాలో అన్ని రకాల బస్సుల్లో దూరాన్ని బట్టి డీజిల్ సెస్ వసూలు చేయనుంది. తక్కువ దూరం ప్రయాణం చేసే ప్రయాణీకుల పై భారం పడకుండా స్లాబులు తీసుకొచ్చిన ఆర్టీసీ ... ఛార్జీల పెంపు నుంచి జీహెచ్ ఎంసీని మినహాయించింది. పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, డీలక్స్ బస్సుల్లో డీజిల్ సెస్ కనీసం రూ.5 గా నిర్ణయించింది. తప్పనిసరై చార్జీలు పెంచాల్సి వస్తోందని, సవరించిన చార్జీలు, బస్ పాస్ చార్జీలు గురువారం మొదటి బస్సు బయలు దేరే సమయం నుండే అమల్లోకి వస్తాయని, ముందుగా రిజర్వ్ చేసుకున్న ప్రయాణీకులకు సవరించిన చార్జీలు వర్తించవని ఆర్టీసీ ఛైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ సజ్జన్నార్ ప్రకటించారు.

## తెలంగాణాలో కరోనా కేసులు

తెలంగాణలో కరోనా కేసులు పెరుగుతున్నందున పరీక్షలు పెంచాలని, అప్రమత్తంగా ఉండాలని తెలంగాణా హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. కరోనా పరిస్థితిపై నివేదిక కూడా ఇవ్వాలని స్పష్టం చేసింది.

## వైద్య ఆరోగ్య శాఖ నియమాలకు మార్గదర్శకాలు జారీ. 80 మార్కులు .. 20 వెయిటేజీ

వైద్య ఆరోగ్య శాఖలో చేపట్టనున్న నియామకాల్లో పొరుగు సేవల సిబ్బందికి వెయిటేజీ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముందు కోవిడ్ కాలంలో సేవలందించిన వారికి మాత్రమే వెయిటేజ్ కల్పించాలని భావించినా, చాలా కాలంగా వైద్య శాఖలో సేవలందిస్తున్న వారి ప్రాధాన్యతను గుర్తించి అందరికీ వెయిటేజీ వర్తింపజేయాలని తీర్మానించింది. గిరిజన ప్రాంతాల్లో సేవలు అందించిన వారికి 6 నెలలకు 2-5 పాయింట్ల చప్పున, గిరిజనేతర ప్రాంతాల్లో అందించిన సేవలకు 2 పాయింట్ల చప్పున ఇస్తారు. 6 నెలలు పూర్తయిన వారిని మాత్రమే వెయిటేజీకి అర్హులుగా పరిగణిస్తారు.

## పిల్లల బాధ్యత తల్లిదండ్రులదే ... హోంమంత్రి

పిల్లలు తప్పుదారిన పడుతున్నారని, వారిని దారిలో పెట్టవలసిన బాధ్యత తల్లిదండ్రులదే అని తెలంగాణా హోం మంత్రి మహమూద్ ఆలీ అన్నారు. జూబ్లీ హిల్స్ అత్యాచారం కేసులో నిందితులు ఎంతటివారైనా వదిలి పెట్ట బోమని స్పష్టం చేశారు. ప్రతి పక్షాలు ఏదైనా మాట్లాడాలంటే ఆచి తూచి మాట్లాడాలని మహమూద్ హితవు పలికారు. నాంపల్లి లోని హజ్ హౌస్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో హోం మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.

## వినూత్న వాహనాల తయారీ లక్ష్యం - ఐక్యాట్ తో ఐఐటీ హెచ్ ఒప్పందం

డ్రైవర్ లేకుండానే దూసుకు పోయే వాహనాలను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ఐఐటీ అడుగులు వేస్తోంది. ఆ దిశగా పరిశోధనలను ముమ్మరం చేసే ప్రణాళికలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే తాజాగా ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఆటోమోటివ్ టెక్నాలజీ (ఐక్యాట్ )సంస్థతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. డ్రైవర్ లేకుండా స్వతంత్రం గా నడిచే వాహనాలను అభివృద్ధి చేసేందుకు వీలుగా దేశంలోనే తొలిసారిగా ఐఐటీ టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ (టీహాన్ ) ను గతంలోనే నెలకొల్పారు. దీనికి కేంద్ర శాస్త్ర సాంకేతిక విభాగం అవసరమైన తోడ్పాటు నందిస్తోంది. రానున్న రోజుల్లో నేలపై, ఆకాశంలో నడిచే వాహనాలను సిద్ధం చేయాలన్నదే ఈ ఏర్పాటు లక్ష్యం.

## ఇంగ్లీష్ పాఠాలు చెప్పేస్తాం అంటే సరిపోదు --- పవన్ కళ్యాణ్

ప్రభుత్వ వైఫల్యాలకు పదో తరగతి విద్యార్థులను ఫెయిల్ చేశారని, ఇంట్లో తల్లి దండ్రులదే తప్పు అని వాళ్లపై నెపం వేస్తారా? అని జన సేన అధినేత పవన్ కళ్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులదే లోపం అంటూ వైకాపా తమ చేతకాని తనాన్ని దాచి పెట్టుకున్నా .. విద్యావ్యవస్థలో వారి లోపభూయిష్టమైన విధానాలను చరిత్ర దాచి పెట్టుకోదని పవన్ అన్నారు.

## విశాఖ వచ్చేసింది ...విలాసాల 'కార్డేలియా'

విలాస వంతమైన సముద్ర విహార నౌక 'కార్డేలియా' విశాఖపట్నంలో అందుబాటులోకి వచ్చేసింది. ఈ షిప్ బుధవారం ఉదయం వైజాగ్ పోర్టుకు చేరుకుంది. భారత సాగర తీరంలో మాత్రమే ప్రయాణించే 'కార్డేలియా' .. విశాఖ --పుదుచ్చేరి --చెన్నై --విశాఖ మార్గంలో తొలి సారిగా తన సేవలు అందిస్తోంది. కార్డేలియా --క్రూయిజ్ సంస్థ నడుపుతున్న ఈ విలాసాల నౌక సముద్రంలో తేలియాడే ఓ స్టార్ హోటల్. ఆ హోటళ్లలో లేని సినీమా థియేటర్లు, అడ్వెంచర్ యాక్టివిటీస్ ని కూడా ఇందులో చూడొచ్చు. 11 అంతస్తులు ఉండే ఈ నౌకలో ఎన్నో అధునాతన సౌకర్యాలు ఉన్నాయి. ఈ షిప్ లో విశాఖ నుండి చెన్నై వెళ్లినందుకు 36 గంటలు సమయం పడుతుంది. ఇందులో ఒక్కసారే 1500 ల మంది దాకా ప్రయాణించవచ్చు. ఇప్పటికే ఈ పర్యాటక ప్యాకేజీ టిక్కట్లు హాట్ కేకుల్లా అమ్ముడు పోయాయి.

## వచ్చే ఎన్నికల్లో 175 కి 175 సాధించాలని సీఎం జగన్

తాడే పల్లి కేంప్ కార్యాలయం లో మంత్రులు, వైకాపా ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్ ఛార్జులతో నిర్వహించిన వర్క్ షాపులో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రి జగన్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో 175 కి 175

స్థానాలు సాధించాలని, రానున్న ఎన్నికల్లో అదే మన లక్ష్యమని, ఇది కష్టం కాదని అన్నారు.

భాజపా గోదావరి గర్జన బహిరంగ సభ

రాజమహేంద్ర వరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానంలో మంగళ వారం సాయంత్రం 'భాజపా గోదావరి గర్జన బహిరంగ సభ' లో కన్నా, పురంధరేశ్వరి, సుజనా, జయప్రద, జీవీఎల్, మాధవ్ మొదలైన వారంతా పాల్గొని రాజ మహేంద్ర వరం తెలుగు వారి చారిత్రిక సంస్కృతికి నిలయమని, తెలుగు సంస్కృతి ఇక్కడనుండే మొదలైందని అన్నారు. ఈ జన సమూహాన్ని చూస్తే రానున్న ఎన్నికల్లో భాజపా విజయం ఖాయమని అనిపిస్తోందని భాజపా జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా అన్నారు.

105 గంటల్లో 75 కిలో మీటర్ల రహదారి నిర్మాణం.

మహారాష్ట్ర లోని అమరావతి ---- అకోలా జిల్లాల మధ్య కేవలం 105 గంటల్లోనే 75 కిలోమీటర్ల మేర రహదారిని నిర్మించి, ఖతార్ పేరిట ఉన్న గిన్నెస్ రికార్డును జాతీయ రహదారుల నిర్మాణ సంస్థ తిరగరాసింది. దేశీయ రహదారులకు కొత్త రూపు నిస్తున్న జాతీయ రహదారుల నిర్మాణ సంస్థ (NHA ) దేశం మొత్తం గర్వించేలా సరికొత్త రికార్డు నెలకొల్పింది.

ఢిల్లీ మెట్రో స్టేషన్ లో భారీ అగ్ని ప్రమాదం

ఆగ్నేయ ఢిల్లీ జామియా నగర్ మెట్రో స్టేషన్ పార్కింగ్ ప్రాంతంలో సుమారు 90 వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదంపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది 11 ఫైరింజన్లు సాయంతో అతి కష్టం మీద మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు.

ఢిల్లీలో బొగ్గు వినియోగాన్ని నిషేధించండి .... ప్రభుత్వానికి కీలక ఆదేశాలు.

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం పెరుగుతున్న వేళ, వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ ( caqm ) ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీ తో పాటు పరిసర ప్రాంతాల్లో బొగ్గు వినియోగాన్ని నిషేధించాలని, పారిశ్రామిక, గృహ, ఇతర పనుల్లో బొగ్గు వాడకుండా ఈ నిబంధన 2023 జనవరి 1వ తేదీ నుండి పూర్తి స్థాయిలో అమల్లోకి తీసుకు రావాలని పేర్కొంది. అయితే థర్మల్ పవర్ ప్లాంట్లలో తక్కువ సల్ఫర్ బొగ్గు వాడకానికి మాత్రమే ఈ నిషేధంనుండి మినహాయింపు కల్పించింది.

సానియాకు త్వరలో కొత్త తేదీలతో సమన్లతో

నేషనల్ హెరాల్డ్ పత్రిక అవినీతి కేసులో కాంగ్రెస్ అధినాయకురాలు సోనియా గాంధీకి ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ED) నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా జూన్ 8న ఈడీ ముందు విచారణకు హాజరు కావాల్సి ఉండగా, జూన్ 2న సోనియా గాంధీకి కరోనా పాజిటివ్ గా తేలింది. అందుకే ఈడీ ఎదుట విచారణకు హాజరు కావడానికి 3 వారాల గడువు ఆమె కోరారు.

డ్రాగన్ గుప్పిట్లో కంబోడియా! చైనా భూభాగం బయట రెండో సైనిక స్థావరం.

ఇండో -- పసిఫిక్ ప్రాంతంలో బల ప్రదర్శనకు చైనా సిద్ధం అవుతోంది. కంబోడియాను పావుగా ఎంచుకుని చైనా భూభాగం బయట రెండో సైనిక స్థావరాన్ని ఆసియాలో నిర్మించ తలపెట్టింది. ఈ స్థావరం నిర్మాణ పనులను గురువారం నుండి మొదలు పెట్ట నున్నట్లు 'ది వాషింగ్టన్ పోస్టు' కథనం వెలువరించింది. అదే రోజు నిర్మాణం, ఆర్థిక సహకారంలో చైనా పాత్ర తేలే అవకాశం ఉంది. కంబోడియా ప్రభుత్వం అదేం లేదు అని బుకాయిస్తున్నా కేవలం కంబోడియా నౌకా దళాన్ని బలోపేతం చేయడానికే ఈ ఆధునీకరణ పనులు అని తెలుస్తోంది. ఈ నౌకాశ్రయ అభివృద్ధి పనులకు సంబంధించి మాత్రం ఈ వారం రెండు భూమి పూజలు నిర్వహిస్తున్నట్లు కంబోడియా ప్రతినిధి ఫైసిఫాన్ ధృవీకరించారు. దక్షిణ చైనా సముద్రంలో హక్కుల కోసం వియత్నాం చైనాతో తలపడుతోన్న విషయం విదితమే.

2017 లో జబూటీ సైనిక స్థావరం ప్రారంభించిన ప్రారంభించి, తర్వాత బీజింగ్ కొత్త వాటి ఏర్పాటు వేటలో పడింది. నౌకా దళం, వాయుసేన, స్పీడ్, పాదాది దళం రంగాల్లో బలపడేందుకు వీలుగా కొత్త స్థావరాలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు పెంటగాన్ నివేదిక పేర్కొంది. ఇందుకోసం డ్రాగన్ కంబోడియా, తాంజానియా, యూఏఈ మొదలైన 12 దేశాల పేర్లు ఉన్నాయి. అమెరికా కు వ్యతిరేకంగా చేపట్టే కీలకమైన ఆపరేషన్లకు

మద్దతుగా ఉంటాయి. ఇప్పటికే యూఏఈ లోని అబుదాబీ పోర్టు వద్ద రహస్యంగా సైనిక స్థావరం నిర్మిస్తున్న విషయం బయటకి పొక్కింది. దీంతో అమెరికా అప్రమత్తమై ఒత్తిడి చేయడంతో నిలిపి వేశారు. దక్షిణ చైనా సముద్రంలో ని దక్షిణ భాగంలో చైనా నౌకలు మోహరించేందుకు అవకాశం లభిస్తుంది.

జననాల రేటు తగ్గడంపై ఎలాన్ మస్క్ హెచ్చరిక

చైనాలో జనాభా పెరుగుదల రేటు భారీ స్థాయిలో పడిపోతోందని, ప్రపంచ జనాభాలో ఒకరైన ఎలాన్ మస్క్ .. చైనా జనాభాపై మరోసారి స్పందించారు. అతి తొందరలోనే జనాభా పతనాన్ని చవి చూడనుందని, జననాల రేటు గణనీయంగా క్షీణిస్తోందని, రానున్న రోజుల్లో మరింత పతనం అవుతుందని ఎలాన్ మస్క్ తాజాగా వచ్చిన వార్తలపై స్పందించారు.

రాష్ట్రాలను అలర్ట్ చేసిన కేంద్రం.

పలు రాష్ట్రాల్లో వ్యాక్సినేషన్ మందగించడంతో జూన్ జూలై నెలల్లో పలు రాష్ట్రాల్లో కరోనా వ్యాక్సిన్ పంపిణీ చేసేలా ప్రయత్నాలు ముమ్మరం చేయాలని అన్ని రాష్ట్రాలు / కేంద్రపాలిత ప్రాంతాలకు స్పష్టం చేసింది. ముఖ్యంగా 12 నుండి 14 ఏళ్ల పిల్లలకు టీకా పంపిణీ తక్కువగా ఉండడం, మరో వైపు ఆ వయసు వారికి కోవిడ్ ముప్పు అధికంగా ఉన్నందున వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కేంద్ర ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది.

పాక్ లో ఆంక్షలు ... రాత్రి 10 దాటితే పెళ్లి వేడుకలు వద్దు

పాకిస్థాన్ తీవ్ర సంక్షోభంలో కొట్టు మిట్టాడుతుండడంతో, రాజకీయ అస్థిరత, ఆర్థిక సంక్షోభానికి తోడు తాజాగా విద్యుత్ సంక్షోభం కూడా ఆ దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అందుకే విద్యుత్ ను ఆదా చేసేందుకు వీలుగా రాత్రి 10 దాటితే జరిగే వివాహాలపై నిషేధం విధించినట్లు అక్కడి మీడియా ద్వారా తెలుస్తోంది.

చైనా నుండి ప్రశంసలు అందుకున్న భారత్

తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న శ్రీలంక కు సహాయం చేయడంలో భారత్ ఎంతో కృషి చేసిందంటూ చైనా ప్రశంసలు కురిపించింది. అంతే కాక భారత ప్రభుత్వం శ్రీలంకను ఆదుకునేందుకు గొప్ప ప్రయత్నాలు కూడా చేసిందని అధికార ప్రతినిధి ఝూవో లిజియాన్ పేర్కొన్నారు. శ్రీలంకను ఆదుకునేందుకు భారత్ తో పాటు అంతర్జాతీయ సమాజం చేస్తున్న ప్రయత్నాల్లో భాగస్వామ్యం అయ్యేందుకు తాము కూడా సిద్ధంగా ఉన్నా-మని అన్నారు.

ప్రస్తుతం మన రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ పరిస్థులను బట్టి చూస్తే, మన ప్రజలంతా కలిసి కట్టుగా నిస్వార్ధంగా ఉండి, పాకిస్థాన్, శ్రీలంక లాంటి దేశాలు ఎదుర్కొంటున్న కష్టాలు దృష్టిలో ఉంచుకుని, ఎంతో జాగరూకతతో ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంది. అమెరికా లాంటి దేశాల్లోని ప్రజలలో అంటే పేద వారి దగ్గర నుండి ప్రతీ ఒక్కరు నిజాయితీగా ఉంటూ, సమయ పాలన నిర్వహిస్తూ పరిశుభ్రత పాటిస్తూ వర్క్ ఈజ్ వర్షిప్ అని ఎంతో నిబద్ధ-తగా ఉంటారు. మన ప్రజలు వారి నుండి అలాంటి మంచివి నేర్చు-కుంటూ, మన జీవితాలను సుఖమయం చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఏ ఒక్కరూ అబద్ధాలు చెప్పరు. సమయం అంటే సమయమే. ఇళ్లలో పని చేయటానికి వచ్చేవారు దొంగ తనమన్న-ది చెయ్యరు. ఇల్లు వాళ్ల మీద వదిలివెళ్ళచ్చు, బంగారం ఎదురుగా పెట్టినా పోదు. ఇలాంటివి ఎన్నో ఉన్నాయి. మన వాళ్ళు ఇలాంటివి నే-ర్చుకోకుండా మన సంస్కృతికి విరుద్ధమైనవి నేర్చుకుని అదే ఫ్యాషన్ గా గొప్పగా చెప్పుకోవడం మన దురదృష్ట కరం.



మన భారతీయులంతా ముఖ్యంగా మన సంస్కృతికి, సాంప్రదాయాల-కు పెద్దపీటవేయాలని చైతన్యం సంకల్పబలం కోరుకుంటోంది.

సర్వేజనా సుఖినో భవంతు

తీగవరపు శాంతి

శ్రీబోధ

# గురు శిష్యులు

భువనచంద్ర



"నువ్వు రేపొద్దున్నే అడివికి వెళ్లి కట్టెలు కొట్టితేవాలి. కనీసం పది మోపులు" కఠినంగా అన్నాడు జ్ఞానకౌశికుడు.

"నాకు రాదు" దురుసుగా అన్నాడు రంతిదేవుడు.

"సరే... నీకు తోడుగా దండనీతి వస్తాడు. నీకు కట్టెలు కొట్టడం, మోపులు కట్టడం మొయ్యడం అన్నీ నేర్పుతాడు. వెళ్లి పడుకో" వ్యంగంగా నవ్వి అన్నాడు జ్ఞానకౌశికుడు.

గుండెల్లో అగ్నిజ్వాల రేగుతున్నా మౌనంగా తలూపి తన పర్ణశాలకు వెళ్ళాడు రంతిదేవుడు.

రంతిదేవుడి తండ్రి మహీపాలుడు. ఆయన కచ్ఛప దేశానికి మహారాజు. ఆయన భార్య లావణ్యాదేవి. వారిద్దరి ఏకైక సంతానమే రంతిదేవుడు. ప్రస్తుతం అతని వయస్సు తొమ్మిదేళ్లు. జ్ఞానకౌశికుడి గురుకులానికి వచ్చి సంవత్సరం అయ్యింది. రంతిదేవుడికి తాను మహారాజు కొడుకుననే అహంకారం. కోపం ముక్కు మీదే ఉంటుంది. ఇష్టం వచ్చింది మాత్రమే చేసే మనస్తత్వం. అతనికి యీ గురుకులం భయంకరమైన చెరసాలలా వుంది. జ్ఞానకౌశికుడు చెప్పినపని సక్రమంగా చెయ్యకపోతే భయంకరమైన శిక్షలు విధిస్తా-



డు. దయాదాక్షిణ్యాలు వుండవు. ఆయనకు తోడు దండనీతి ఒకడు. దండనీతి మహాబలిష్ఠుడు. ఒక్క జ్ఞానకౌశికుడి మాట తప్ప ఎవరిమాటనీ దండనీతి వినడు. శిక్షలు అమలు జరిగేవి దండనీతి చేతిలోనే. సంవత్సరంలో మొదటి ఆరు నెలలూ కవాతు చేయించాడు దండనీతి. కవాతులో ఏ ఒక్కరు తప్పు చేసినా శిక్ష అందరికీ పడేది. అందువల్ల విద్యార్థులే తోటివారిని పసిగట్టి దండనీతికి అప్పజెప్పేవారు. రంతిదేవుడు చాలాసార్లు పట్టుబడ్డాడు. పట్టుబడ్డ ప్రతిసారీ 'దండకొయ్య' తప్పేదికాదు. రోజంతా ఆహారమూ పెట్టేవారు కాదు. మిగతా ఆరునెలలూ కఠినంగా చదివించేవారు. రోజుకి ఎనిమిది గంటలు చదువు. ఆ తరవాత మననం... ఆ తరవాత పరీక్ష. రోజువారీ పరీక్షలతో రాటుదేలారు విద్యార్థులు. తప్పులొస్తే తాట లేచిపోయేది. చదువంటే అస్సలు గిట్టని రంతిదేవుడికి జ్ఞానకౌశికుడి బోధనలవల్ల చదువు అబ్బింది.

రంతిదేవుడికి మహాకష్టంగా వుంది. జ్ఞానకౌశికుడు చిత్రవిచిత్రమైన పనులు చేయిస్తున్నాడు రంతిదేవుడితో. ఒక రోజంతా మొక్కలు పెట్టడానికి గోతులు తీయించాడు.

ఒక రోజంతా పొలానికి ఎరువు తట్టలు మోయించాడు. తాటి చెట్లు ఎక్కించి తాటాకులు కో-

ట్టిస్తే, మరో రోజు ఆవులు గేదెల్ని మేపుకు రమ్మన్నాడు. ఆశ్రమాన్ని ఊడ్పించాడు. పశువుల పేడను తీయించి కొట్టాన్ని శుభ్రపరచమని ఆదేశించాడు. వారంరోజుల పాటు వరసగా బావినుంచి పొద్దున్న సాయంత్రం నీళ్లు తోడించాడు. ఆశ్రమానికి దగ్గరలో ఉన్న ఊరిలో ఓ కుమ్మరి దగ్గర పది రోజులూ, వడ్రంగి దగ్గర పదిరోజులూ, చర్మకారుడి దగ్గర పదిరోజులూ ఇలా రంతిదేవుడి చేత అతి కఠినమైన పనులు చేయించాడు.

రంతిదేవుడుకి జ్ఞానకౌశికుడి మీద కోపం రోజురోజుకీ కొండలా పెరగసాగింది. ఇతర విద్యార్థులకి చిన్నచిన్న పనులూ, రంతిదేవుడికి మాత్రం పెద్దవీ, కఠినమైనవీ. 'సామాన్యుల కొడుకుల్ని దయగా చూస్తూ, క్షమిస్తూ మహారాజు కొడుకైన నన్ను యీ జ్ఞానకౌశికుడు ఇన్ని కష్టాలకు గురిచేస్తాడా? చూస్తా.. చదువయ్యాక యువరాజు పట్టాభిషేకం చేసేది నాకే గదా ఈ జ్ఞానకౌశుకుడి అంతు తేలుస్తా' అని తనలో తానే రగిలిపోయాడు రంతిదేవుడు. పోనీ తల్లికీ తండ్రికీ చెబుదామన్నా మహారాజు ముందే చెప్పాడు .."రంతిదేవా.. నీ చదువయ్యాకే నిన్ను కలిసేది. మీ గురువుతో వినయంగా ప్రవర్తించు. శ్రద్ధాభక్తులతో విద్య నేర్చుకో... సహవిద్యార్థులను స్నేహంగా ఆప్యాయంగా పలుకరిస్తూ నీకు నేర్పే విద్యని వారితో పంచుకుని నీ జ్ఞానాన్ని పెంచుకో. వారి విద్యను వినమ్రంగా నీవు గౌరవించు" అన్నాడు. ఏం చెయ్యాలీ?

రంతిదేవుడికి దండనీతి ఓ తలనొప్పిగా మారాడు. దండనీతి గమనించని విషయం అనేది ఉండదు. ఒక్క క్షణం ఆలసించినా శిక్ష తప్పేది కాదు.

సంవత్సరాలు గడుస్తున్నాయి. పక్క రాజ్యం నుంచి ఇద్దరు వీరులు వచ్చి రంతిదేవుడికి ఆయుధ శిక్షణ నివ్వసాగారు. ఓపక్క న్యాయ, ధర్మ, మానవ మానసిక, వైద్య, ఆధ్యాత్మిక గ్రంథాల పఠనం. మరోపక్క గంటల తరబడి వ్యాయామం, ఈత. విల్లంబులతో, కత్తితో, కవాటాలతో, బల్లాలతో, శూలాలతో ఆయుధ శిక్షణ, ఆత్మరక్షణ.

సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ రంతిదేవుడికి జ్ఞాన కౌశికుడి మీద పగ పెరుగుతూనే వుంది.

తొమ్మిది సంవత్సరాల కఠోర శిక్షణ తర్వాత విద్య పూర్తయినట్లుగా ప్రకటించాడు జ్ఞానకౌశికుడు. ఆ వర్తమానం మహారాజుకి కూడా పంపబడింది. గురుకులం విడిచి వెళ్తున్నవారందరికీ విందు ఏర్పాటు చేశాడు దండనీతి... జ్ఞానకౌశికుడి ఆజ్ఞతో.

ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులు గురుదక్షిణ సమర్పిస్తున్నారు.

కొందరు పది వరహాలూ, ఇరవై వరహాలూ ఇచ్చి దండం పెడితే ధనవంతులు వెయ్యి వరహాలూ, రెండువేల వరహాలూ ఇచ్చి నమస్కరిస్తున్నారు. రంతిదేవుడిలో ఒకపక్క నవ్వు మరో పక్క ద్వేషం నాట్యమాడుతున్నాయి. మహారాజు రాలేదు. అందువల్ల తనవంతు రాగానే రంతిదేవుడు లేచి నిలబడి, "గురువర్యా... నా తండ్రి ఈ మహోత్సవానికి రాలేదు. అందువల్ల ఇప్పుడు ఒక్క వరహా కూడా ఇవ్వలేను. కానీ నేను యువరాజైన మరుక్షణం మీరు జీవితాంతం మరువలేని మరపురాని కానుకలు ఇస్తాను. ఇప్పటివరకూ ఏ శిష్యుడూ గురువుకు ఇవ్వని కానుకలు. ఏ గురువూ శిష్యుడి నుంచి ఊహించని కానుకలు" అన్నాడు.

విద్యార్థులూ, వారి తల్లిదండ్రులూ కాబోయే యువరాజు మాటలకి చప్పట్లు కొట్టారు. ఆశ్రమమంతా చప్పట్లతో మారుమ్రోగింది

జ్ఞానకౌశికుడు లేచి నిలబడి చిన్నగా చిరునవ్వు నవ్వాడు. రెండుచేతులూ చాచి, "రంతిదేవా... ఇటు రా.." అని పిలిచి బిగియారా కౌగలించుకుని,

"రంతిదేవా... ఇదే నువ్వు నాకిచ్చే ఇచ్చే గురుదక్షిణ. నాకు తెలుసు, తొమ్మిదేళ్లుగా నేను నీకిచ్చిన శిక్షణ, శిక్షలూ కూడా అతి కఠినమైనవి. తట్టుకుని నిలబడ్డావు. అంతేకాదు ఏ శిష్యుడూ ఇవ్వని కానుకలు ఇస్తానని ఇంతమంది ముందు సంతోషంగా చెప్పావు. కానీ నువ్వు నాకు ఏ కానుకా ఇవ్వాల్సిన పనిలేదు. ఎందుకంటే ఒక పరిపూర్ణ శిష్యుడుగా ఈ గురుకులాన్నుంచి వెళ్లడమే నాకు నువ్విచ్చిన గురుదక్షిణ.

(33 వ పేజీ చూడండి)

# గ్రీసు దేశపు పురాణ గాథలు



## వేమూరి వేంకటేశ్వరరావు

**"Knowledge is acquired when we succeed in fitting a new experience into the system of concepts based upon our old experiences. Understanding comes when we liberate ourselves from the old and so make possible a direct, unmediated contact with the new, the mystery, moment by moment, of our existence."**
**Aldus Huxley. "Knowledge and Understanding"**

## ముందు మాట

నేను ఈ వ్యాసాలు రాయడానికి ప్రేరణ కారణం ఒక విమాన ప్రయాణం. భారత దేశం వెళుతూ, శేన్ ఫ్రాన్సిస్కో లో ఉదయం 8 గంటలకి బయలుదేరి, నూ అర్క్ చేరునేసరికి సాయంత్రం అయిదు అయింది. పరుగుబాట మీదకి దిగడానికి విమానం సంసిద్ధం అవుతూ ఉండగా, "మనం దిగబోయే పరుగుబాట మీద మరొక విమానం ఉంది. కంట్రోలు టవర్ లో ప్రజలు నిద్రపోతున్నట్లు ఉన్నారు. మరో చుట్టు తిరిగి వస్తాను. అరగంట సేపు ఓపిక పట్టండి," అని చోదకుడు విమానం జోరు పెంచుతూ పైకి లేచేసరికి ఇహ చేసేది ఏమీ లేకపోవడంతో నా కుర్చీకి ఎదురుగా ఉన్న టి.వి. లో ఏదైనా "ఇరవై నిమిషాల కార్యక్రమం" చూద్దామని వెతకడం ఉపక్రమించేను. "అపస్వరం అనే ఏపిల్ పండు కథ" ట. పదిహేను నిముషాలు ట. చూడడం మొదలు పెట్టేను.
పురాతన గ్రీసు దేశపు కథ. ఇంతకు పూర్వం నేనెప్పుడూ ఈ కథ గురించి వినలేదు. ఆసక్తితో చూసేను. గమ్యం చేరుకోగానే గూగుల్ లో వెతికేను. చాల ప్రాచుర్యం ఉన్న కథ. మా అమ్మాయిని అడిగితే, "చిన్నప్పుడు హైస్కూల్ లో చదివేను" అని చెప్పింది. నేను పుస్తకాల పురుగుని అయినా ఈ కథ నా కళ్ళ పడడానికి ఎనభై ఏళ్ళు పట్టిందంటే ఈ కథని వినని వాళ్ళు ఇంకా ఎంతమంది ఉంటారో అనిపించింది. ఈ కథ గురించి పరిశోధన చేస్తూ ఉంటే ఆసక్తికరమైన అంశాలు ఎన్నో తెలుసుకున్నాను. వాటన్నిటిని క్రోడీకరించి వ్యాసాలుగా రాసేను.
ఇక్కడ ఉటంకించిన అంశాలన్నిటినీ కేవలం ఒక నఖచిత్రంలా స్పర్శించినా ఇది పెద్ద గ్రంథం అవుతుంది. అందుకని కొన్ని ముఖ్యమైన అంశాలని మాత్రమే ముచ్చటించేను.

వేమూరి వేంకటేశ్వరరావు
ప్లెజంటన్, కేలిఫోర్నియా

# 18. హెరాక్లీస్ కథ

గ్రీసు పురాణగాథలలోని హెరాక్లీస్ అనే మహా యోధుడే రోమనుల హెర్క్యులిస్ గా రూపాంతరం చెందేడు. హెర్క్యులిస్ (Hercules) అనే పేరు ప్రపంచ వ్యాప్తంగా పరిచితం అయిన పేరు. ఆ మాటకి వస్తే గ్రీసు యోధులలో ఒక్క హెరాక్లీస్ శిల్పమే - శిధిలావస్థలో - భారత దేశంలో, మధుర దగ్గర దొరికింది. అది ఇప్పుడు కోల్కతా లోని పురావస్తు ప్రదర్శనశాలలో ఉందిట!

హిందూ పురాణాలలో భీముడితో తులతూగగల బలశాలులు మరో నలుగురు ఉన్నారు అంటారు: హిడింబాసురుడు, జరాసంధుడు, కీచకుడు, దుర్యోధనుడు. కానీ గ్రీకు పురాణాలలోను, రోమను పురాణాలలోను హెరాక్లీస్ (లేదా హెర్క్యులిస్) తో ఉజ్జీ అయిన అరివీరభయంకరుడైన బలశాలి మరొకడు లేడు.

హెరాక్లీస్ దైవాంశ సంభూతుడు; సాక్షాత్తు జూస్ కీ ఒక మానవ వనిత ఆల్^క్మని (Alcmene) కి పుట్టిన కొడుకు అవడం వల్ల తండ్రి నుండి కొన్ని దేవ లక్షణాలు, తల్లి నుండి కొన్ని మానవ



లక్షణాలు అబ్బేయి.

ఈ ఆల్^క్మని ఎవరు? ఈమె ఎలక్ట్రియాన్ (Electryon) కూతురు. ఈ ఎలక్ట్రియాన్ ఎవరు? ఇతను పెర్సియస్ కీ ఆండ్రోమెడా కి పుట్టిన కొడుకు. పెర్సియస్ ఎవరు? జూస్ కీ డనయే (Dana ) కి పుట్టిన కొడుకు. అనగా, జూస్ కొడుకు పెర్సియస్, అతని కొడుకు ఎలక్ట్రియాన్ కాబట్టి వరసకి జూస్ కి ఆల్^క్మని మునిమనవరాలు అవుతుంది.


హేసియోడ్ చెప్పిన కథనం ప్రకారం ఆల్^క్మని అంతటి అందమైన మానవ వనిత మరొకతె లేదు. సన్నటి నడుము, సంపెంగ ముక్కు, నల్లటి కళ్ళతో ఆమె అందం ఏఫ్రొడీటీ అందాన్ని తలదన్నేలా ఉండేదని హేసియోడ్ వర్ణిస్తాడు.

ఒక నాడు ఆల్^క్మని తన స్నేహితుడు, ప్రియుడు, అయిన ఏంఫిట్రియాన్ (Amphitryon) తో కలిసి యుద్ధ రంగంలోని విడిదికి వెళుతుంది. ఏంఫిట్రియాన్ రణరంగంలో ఉన్న సమయంలో ఏంఫిట్రియాన్ వేషంలో జూస్ ఆల్^క్మని మం-



దిరంలోకి ప్రవేశించి, తన ముని మనవరాలితో రమిస్తూ మూడు రాత్రులు గడపడం వల్ల హెరాక్లీస్ తో ఆమె గర్భవతి అవుతుంది! నాలుగవ రోజు రణరంగం నుండి ఏంఫిట్రియాన్ రాకతో జరిగిన మోసం ఆల్^క్మిని కి అవగతం అవుతుంది. రణరంగం నుండి తిరిగి వచ్చిన ఏంఫిట్రియాన్ భార్యతో రమించడం వల్ల ఆల్^క్మిని గర్భంలో ఇఫిక్లీజ్ (Iphicles) పిండం పెరగడం మొదలవుతుంది. ఇలా ఇద్దరు పురుషులకి చెందిన బిడ్డలు ఒకే సారి తల్లి కడుపులో పెరగడం సాధారణంగా జరగదు కానీ అసంభవం కాదు. (దీనినే ఇంగ్లీషులో heteropaternal superfecundation అంటారు.) కనుక ఏంఫిట్రియాన్ కి ఇఫిక్లీజ్ సొంత కొడుకు, హెరాక్లీజ్ సవతి కొడుకు అవుతారు.

జూస్ పట్టమహిషి హేరా కి జూస్ ఒక మానవ వనితతో నడుపుతున్న వ్యవహారం నచ్చలేదు. ఆల్^క్మిని గర్భంలో పెరుగుతున్న హెరాక్లీజ్ మీద ఒక రకం ద్వేషం పెంచుకుంది. ఇలా రగులుతున్న ద్వేషం తన కడుపులోనే దాచుకుని అవకాశం కోసం ఎదురు చూడసాగింది. హోమర్ ఇలియాడ్ లో చెప్పిన కథనం ప్రకారం ఆల్^క్మిని మరునాడు ప్రసవిస్తుందనగా జూస్ - హేరా ప్రోద్బలంతో - ఒక సంచలనాత్మకమైన ప్రకటన చేసేడు. ఏమని? మరునాడు పుట్టబోయే బాలుడే దేవలోకానికి అధిపతి అవుతాడని! హేరా హుటాహుటి ఒలింపస్ పర్వతం నుండి దిగి వచ్చి పెర్సియస్ పెద్ద కోడలు నెలలు నిండకుండానే ప్రసవించేటట్లు చేసింది. అదే ఊపులో నెలలు నిండిన ఆల్^క్మిని మరునాడు ప్రసవించకుండా మంత్ర శక్తితో ఆపు చేసింది. ఈ కుతంత్రం వల్ల హెరాక్లీజ్ కి చెందవలసిన రాజ్యం పెర్సియస్ పెద్ద మనుమడు, నెల




తక్కువ వాడు అయిన, యురీస్తి-యస్ కి దక్కింది.
హేరా వేసిన ఎత్తుకి పైయెత్తు అన్నట్లు ఒకనాడు ఎథీనా ఆకలితో ఉన్న చిరుత ప్రాయపు హెరాక్లీ-స్ ని తీసుకెళ్లి అనాథ బాలుడని చెప్పి హేరా అక్కున చేర్చింది. హేరా తన చన్నులని చీకడాని-కి అందించింది. పాలు తాగు-తున్న హెరాక్లీజ్ చనుమొనలని కొరికేడు. హేరా రొమ్ముల నుండి ప్రవహించిన పాలే ఆకాశంలో మనకి కనిపిస్తున్న పాలపుంత! అంతే కాదు. దైవాంశ ఉన్న హేరా పాలు తాగడం వల్ల హెరాక్లీజ్ బలం ఇనుమడించింది, రవంత దైవాంశ కూడా ప్రాప్తించింది.
ఈ సంఘటనతో హేరాకి హెరాక్లీ-





జ్ మీద ద్వేషం కూడా ఇనుమడించింది. ఒకనాడు చంటి బిడ్డ ఉయ్యాలలో పడుక్కుని ఉండగా వాడిని చంపడానికి రెండు పాములని పంపించింది. ఆ పాముల్ని చంటివాడు చేతులతో నలిపి చంపేశాడు.

ఇంతటితో హెరాక్లీజ్ ఇడుములు అంతం కాలేదు. హేరా పగకి పట్టపగ్గాలు లేకుండా పోయాయి. హేరా పెడుతున్న బాధలు భరించలేక హెరాక్లీజ్ తన భార్యని పిల్లలని చంపేస్తాడు. తరువాత పశ్చాతాపంతో కుంగి పోతాడు. చేసిన పాపానికి ప్రాయశ్చిత్తంగా యురీస్తియస్ కొలువులో ఉండి అతను ఆదేశించిన పనులు చెయ్యడానికి ఒప్పుకుంటాడు. వీటినే హెరాక్లీజ్ చేసిన పన్నెండు సాహస కృత్యాలు అంటారు. నిజానికి ఈ పన్నెండింటిని మించి మరెన్నో సాహసాలు చేసేడు. ఈ పన్నెండింటిలో కొన్ని మాత్రమే ఈ దిగువ చెబుతాను.

1. కత్తులకూ, బరిసెలకూ, బాణాలకూ లొంగని ఒక భయంకరమైన సింహం ఆ ప్రాంతాలని బాధిస్తుతోంది. దానిని చంపాలి. హెరాక్లీజ్ దాని పీకని చేతులతో నలిపి చంపేసి, దాని చర్మాన్ని ఒలిచి అంగవస్త్రంగా ధరించి, దాని శరీరాన్ని గిరగిరా తిప్పి ఆకాశంలోకి విసిరేసేడు. అదే ఇప్పుడు మనకి ఆకాశంలో కనిపించే సింహ (Leo) రాశి. హెరాక్లీజ్ విగ్రహాలలో ఈ సింహపు తోలు



తరచు కనిపిస్తూ ఉంటుంది.

2. ఆ ప్రాంతాలలో తొమ్మిది తలకాయల మహా సర్పం ఒకటి ఉండేది. ఈ పాముని సాక్షాత్తూ హేరా పెంచి పెద్దచేసింది; హెరాక్లీజ్ మీద కసి తీర్చుకునే నిమిత్తం! ఆ పాము తల ఒకటి నరికితే మరొకటి పుట్టుకొస్తూ ఉండేది. దానిని చంపాలి. హెరాక్లీజ్ దాని తొమ్మిది తలలూ ఒకే వేటులో నరికేసి, తిరిగి తల మొలవకుండా కాలుతున్న శలాకతో వాతలు పెట్టి, చంపేసేడు. అదే ఇప్పుడు ఆకాశంలో అజగరం (Hydra) అనే నక్షత్ర రాశిగా మనకి కనిపిస్తుంది.

3. హెరాక్లీజ్ సాధించిన ఘన విజయాలు చూసి యురీస్తియస్, హేరా లు సహించలేక పోయారు. ఈ మారు ఒక మృగాన్ని చంపడానికి బదులు ప్రాణాలతో పట్టి తెమ్మని ఆదేశించారు. అది డయానా దేవతకి చెందిన లేడి. అతి వేగంగా పరిగెత్తగల, బంగారు కొమ్ములు ఉన్న లేడి. ఆ లేడిని గాయపరచకుండా పట్టుకుని, తెచ్చి, రాజుకి ఇవ్వాలి. హెరాక్లీజ్ ఒక ఏడాది పాటు ఆ లేడిని వెంటాడి చిట్టచివరికి పట్టుకున్నాడు. యురీస్తియస్ ఏమనుకున్నాడంటే అడవిలోతిరుగాడే లేడిని బంధిస్తే వనదేవత ఆర్టెమీస్ కి కోపం వస్తుంది. అప్పుడు “కాగల కార్యాన్ని ఆర్టెమీస్ తీరుస్తుంది” అనుకున్నాడు. కానీ లేడిని పట్టుకుని వస్తూవుంటే ఆర్టెమీస్, ఆమె కవల సోదరుడు అపాలో ఎదురయ్యారు. వారికి తన కథ చెప్పి లేడిని పట్టుకున్నందుకు క్షమాబిక్ష వేడుకున్నాడు. ఏ కళనుందో ఆర్టెమీస్ ‘సరే’ అంది. హెరాక్లీజ్ బతికిపోయాడు!

4. ఆర్కేడియాలో పంట భూములని నాశనం చేస్తున్న అడవి పందిని ప్రాణాలతో పట్టుకోవాలి. ఖైరాన్ సహాయంతో హెరాక్లీజ్ ఆ అడవి పందిని పట్టుకుంటాడు.

5. వెయ్యి పశువులు ఆక్రమించి, ముప్పయ్ ఏళ్లుగా సంర-



క్షణ లేకుండా పడి ఉన్న లెజియన్ రాజు గారి పశువుల సాలని శుభ్రం చెయ్యాలి. రెండు నదీప్రవాహాలని మళ్లించి, పశువుల సాల గుండా ప్రవహింపజేసి, ఒక్క రోజులో ఆ సాలను శుభ్రపరచాడు.

6. కంచు ముక్కులు, లోహపు రెక్కలతో బాటసారులను వేధించి తింటున్న రాక్షసి పక్షులని చంపాలి. ఎథీనా సహాయంతో వీటిని ఎదుర్కొని పారదోలుతాడు. అవి చెల్లాచెదరు అయిన తరువాత వాటిలో కొన్నింటిని చంపి కొన్నింటిని తరిమి కొడతాడు. అలా పారిపోయిన పక్షులే మరల అర్గోనాటులని ఎదుర్కోడానికి జేసన్-అర్గోనాట్ ల కథలో వస్తాయి.

7. ముక్కు లోంచి మంటలు చిమ్ముతూ, బుసలు కొడుతూ, క్రీట్ ద్వీపాన్ని ధ్వంసం చేస్తున్న పొసైడన్^ దేవుడి ఆంబోతులని అదుపులో పెట్టాలి.

ఇలా మొత్తం పన్నెండు సాహస కృత్యాలు చేసేడు. అంటారు కానీ నిజానికి మరెన్నో సాహసాలు చేసేడు.

సోఫోక్లిస్ చెప్పిన కథనం ప్రకారం రకరకాల జంతువుల రూపాలలోకి, పక్షుల రూపాలలోకి మారిపోగలిగే అఖేలస్ (Achelous) అనే జలదేవుడుతో యుద్ధం చేసి డియనీరా (Deianira) అనే అందగత్తెని పెళ్లి చేసుకున్నాడు. చివరికి పరోక్షంగా ఆమె వల్లనే అతనికి చావు మూడింది. అదెలా అంటే వీరిరువురు ఒక పడవలో ఒక నదిని దాటుతూ ఉండగా నెస్సస్ (Nessus) అనే పేరు గల ఒక నరతురంగం (centaur) డియనీరా ని ఎత్తుకుపోయింది. హెరాక్లీజ్ దానిని వెంబడించి చంపుతాడు. అది ప్రాణాలు విడచిపెడుతూ డియనీరా కి తన రక్తాన్ని కొద్దిగా బహుమానంగా ఇస్తాడు. ఇచ్చి, "నీ భ ర్త నిన్ను గాక మరొకరిని చేరదీస్తున్నాడని అనుమానం వస్తే అతను

కట్టి విడిచిన బట్టని ఈ రక్తంలో ముంచినట్లయితే నీ భర్త నీ వాడవుతాడు." అని చెబుతాడు.

ఒకసారి హెరాక్లీజ్ ఒకబానిస పిల్ల ప్రేమలో పడతాడు. డియనీరా కి ఆ విషయం తెలిసింది. అప్పుడు తన భర్త కట్టి విడిచిన బట్టలని ఆ నరతురంగం ఇచ్చిన రక్తంలో ముంచింది. నిజానికి ఆ రక్తం ప్రమాదకరమైన విషం. ఆ విషం హెరాక్లీజ్ ని చంపింది. అప్పుడు జూస్ మెరుపులు పిడుగులతో కూడిన తన వజ్రాయుధాన్ని హెరాక్లీజ్ మృత శరీరం మీదకి విసురుతాడు. హెరాక్లీజ్ ఆత్మ ఒలింపస్ పర్వతం మీద ఉన్న ఇతర దేవగణాలని చేరుకుంది. హెరాక్లీజ్ భౌతిక శరీరం మీద మంటలు లేచాయి. ఆ మంటలు ఎగసి స్వర్గం దాకా వెళ్ళేయి. ఆకాశం ఎర్రబడింది. హెరాక్లీజ్ నక్షత్ర లోకంలోచిరస్థాయిగా నిలచిపోయేడు.

చీకటి రాత్రి తలెత్తి ఆకాశం వైపు చూస్తే హెర్క్యులిస్ నక్షత్ర మండలాన్ని గుర్తించడం అంత తేలిక కాదు. ఎందుకంటే ఆ రాశిలో పేరెన్నికగన్న నక్షత్రాలు ఏవీ లేవు. ఈ రాశి బూటెస్ (భూతేశ), లైరా (వీణ) మండలాలకు మధ్యస్తంగా, అఫియాకస్ కి తల తగులుతోందా అన్నట్లు తలకిందులుగా



కనిపిస్తుంది.

హెర్క్యులిస్ నక్షత్ర మండలాన్ని జాగ్రత్తగా చూస్తే ఒక తెల్లని మచ్చ కనిపిస్తుంది. దీనిని దుర్భిణిలో చూస్తే ఇది ఆణిగుచ్ఛం (ఒక నక్షత్రాల గుత్తి, star cluster) అని తేలింది. దీనిని వేదకాలపు భారతీయులు గుర్తించి ఋగ్వేదం (1-154-5) వ మంత్రంలో, "విష్ణోః పదే పరమే మధ్య ఉత్సః" అన్నారు. అంటే "విష్ణుపద మండలంలో గొప్ప తేనెపట్టు వంటి చక్కని దృశ్యం" అని అర్థం!

హెరాక్లీజ్ గ్రీకు యోధులందరిలోకి ఎక్కువ కీర్తి ప్రతిష్ఠలు గణించేడు. ప్రపంచవ్యాప్తంగా ఇతనికి ఉన్నన్ని విగ్రహాలు మరే గ్రీకు యోధునికి లేవేమో! ఇతని విగ్రహాలన్నిటిలోను గడ్డం లేని ముఖం, కండలు తిరిగిన శరీరం, చేతిలో విల్లమ్ముల్లకి బదులు దుడ్డుకర్ర ఉండడం, సింహపు చర్మం వీపు మీద వెళ్ళాడుతూ ఉంటే సింహపు పంజాలు మెడ కింద ముడేసినట్లు ఉండడం సర్వసాధారణం. హెరాక్లీజ్ చేసిన వీరవిహారాలలో భారతదేశపు పొలిమేరల లోకి కూడా వచ్చేడని ఒక నమ్మకం ఉంది. ఆ నమ్మకానికి ఋజువుగా మధురలో దొరికిన తల లేని హెరాక్లీజ్ విగ్రహం ఒకటి కోల్కతా లోని సంగ్రహాలయంలో ఉంది!

# ‘వైవిధ్య భరిత యాత్రాస్థలి సింహళమ్’




ఆచార్య మత్స్యరాజ హరగోపాల్

క్యాండీనగర సందర్శనం లేని శ్రీలంక (సింహళ) యాత్ర అసంపూర్తి అని చెప్పవచ్చు. ఇది శ్రీలంక దేశపు సాంస్కృతిక రాజధాని. చుట్టూ ఎత్తైన కొండలు మధ్యలో సరస్సు, బౌద్ధ, హైందవ దేవాలయాలు, అందమైన విశాలమైన తోటలు, ముఖ్యంగా ప్రాచీన కళాసంపదలకు నిలయమైన ఈ ప్రదేశం చూడముచ్చటగా ఉంటుంది. మరువలేని, మరుపురాని అనుభూతుల్ని కల్గజేస్తుంది.

మరునాడు (నాల్గవరోజు) ఉదయమే 258 ఏళ్ళనాటి సెల్వ వినాయక మందిరాన్ని దర్శించాం. ఇక్కడ శివపార్వతుల గణేశ, దుర్గమందిరాలతోపాటు నవగ్రహ, నటరాజ శిల్పాలు, శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయం కూడా ఉంది. ఇక్కడ పూజ, దీపారాధన చేసుకున్నాం.

అక్కడ నుండి క్యాండీనగరానికి వన్నె చేకూర్చిన ‘మహాబోధి మహావిహార’ 850 అడుగుల ఎత్తుపై కొండపై భాగంలో ఉండి, 88 అడుగుల బుద్ధభగవానుని విగ్రహాన్ని దర్శించాం. ఈ విగ్రహము క్యాండీనగరంలోని ఎక్కడ నుంచైనా బాగా కన్పి-





స్తుంది. నగరానికి వన్నె తెచ్చింది. దాదాపు గంట సమయం ఇక్కడ గడిపి, కొండపై భాగం నుంచి నగర సౌందర్యాన్ని తిలకించాం. అద్భుత దృశ్యమిది. క్రిందికి దిగిన తర్వాత క్యాండీ సరస్సు చుట్టూ కార్లో మరోసారి తిరిగి, దగ్గర్లోని భారతీయ హోటల్లో మన వంట-కాలలో భోజనం చేశాం. తర్వాత ఇక్కడి దుకాణాల్లో స్థానిక చేతివృ-త్తులవారు తయారుచేసిన కొన్ని సావనీర్లను కొన్నాం.

మధ్యాహ్నం ఈ నగర శివార్లలో-ని రాయల్ బాటానికల్ గార్డెన్స్ (Royal Batanical Gardens) సందర్శించాం మహావళీ నదీ తీరాన క్రిందట క్రీ.శ.1374లో చిన్న తోటగా ప్రారంభమై నేడు 147 ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల ఫల, పుష్ప వృక్షాలతో, దేశంలోనే అతి ప్రసిద్ధమైన గార్డెన్స్‌గా ఉంది. నేడు నాలుగువేల రకాల వృక్షాలు ఇక్కడ ఉన్నాయి. వివిధ దేశాధిప-తులు, శ్రీలంకను సందర్శించిన-పుడు ఇక్కడి 'మొక్క'ను నాటకం పరిపాటి. మా సందర్శన రెండు గంటలపాటు సాగింది. తర్వాత ఈ ప్రయాణం లంకా నగరంలో-ని మరో విశేష నగరం 'నువారా ఈలీయా' వైపు. మార్గమధ్యం-లో 'రంబోడా' అనే ప్రదేశంలోని కొండపై స్వామి చిన్మయానంద మిషన్‌వారి అధ్వర్యంలోని 'భక్త-హనుమాన్' మందిరాన్ని సంద-ర్శించాం. ఎత్తైన ఆంజనేయస్వా-మి విగ్రహం కొండ క్రింది భాగంలో 'మహావళీనది, ఎదురుగా ఎత్తైన కొండలు ఈ ప్రదేశానికి ఆధ్యాత్మిక శోభను ద్విగుణీకృతం చేశాయి.

ఈ కొండపై 'సీతాదేవి'ని వెద-కడానికి శ్రీలంక వచ్చిన ఆంజ-నేయస్వామి మొదట పాదాల్ని మోపినాడని ప్రచారంలో ఉంది. చిన్మయిమిషన్‌వారి పుస్తక వి-క్రయశాల, భోజనాలయం ఉన్నాయి. తప్పక సందర్శించదగిన స్థలమిది ` 'సూర్యాస్తమయ' దృశ్యాన్ని ఈ కొండ పైభాగం



నుంచి వీక్షించి, రాత్రికి 'నువారా ఈలియా' చేరుకున్నాం. రాత్రికి గ్రెగోరీ సరస్సు దగ్గర హోటల్‌లో బసచేశాం.

మరునాడు (ఆరవరోజు) ఉదయం నగర సందర్శనానికి బయలుదేరాం. సముద్ర మట్టానికి 6182 అడుగుల ఎత్తున, చుట్టూ పర్వతాలు, లోయలు, జలపాతాలు, టీగార్డెన్స్‌తో చూడముచ్చటైన ప్రదేశమిది. శ్రీలంక వేసవి విడిదిగా, ఆసియా ఖండంలోని ప్రముఖ 'గార్డెన్‌సిటీ'గా ప్రసిద్ధిగాంచిన 'నువార ఈలీయా', మన 'రామాయణ గాథ'తో కూడా ముడిపడి ఉంది. ఇక్కడే 'లంక'లో 'సీతాదేవి'ని రావణాసురుడు బంధించి ఉంచిన స్థలంలో నేడు సీతానదీ తీరాన సీత అమ్మవారి ఆలయముంది. మందిరంలో సీతారామ లక్ష్మణులు ఆంజనేయస్వామి విగ్రహాలు చూడముచ్చటగా ఉంటాయి.

ఈ ప్రదేశంలోనే ఆంజనేయ స్వామివారు సీతాదేవిని సందర్శించినాడట. ఇదే 'అశోకవన' ప్రాంతమని. నేడు వీటిని 'హగకాలవన'మని పిలుస్తున్నారని వినికిడి. ఈ విశాలమైన వనంలో అశోకవృక్షాలను చూశాం. నగరానికి మరోవైపు విశాలమైన తేయాకు తోటలున్నాయి. ఈ ప్రాంతం కేరళలోని 'మున్నార్' (Munnar) ను తలపిస్తుంది. వివిధ రకాలైన 'తేయాకు' ఇక్కడ పండిస్తారు, అమ్ముతారు.

వివిధ రకాల తేయాకుతో తయారుచేసిన తే నీటిని సేవించాం తర్వాత మళ్ళీ 'రంబ్‌డా' పర్వతంపై ఆంజనేయస్వామిని సందర్శించి, సూర్యాస్తమానాన్ని చూశాం. దగ్గర్లోని జలపాతాలకు చూసి రాత్రికి హోటల్ చేరుకున్నాం. మరుసటి రోజు (ఏడవ దినం) నగరంలోని గాయత్రీ పీఠాన్ని దర్శించాం. ఇక్కడే, రామాయణ కాలంలో 'ఇంద్రజిత్' నికుంభలా యజ్ఞా-



న్ని చేశాడని చెబుతారు. ఈ అందమైన, చారిత్రాత్మక నగరాన్ని వదిలి, శ్రీలంక పశ్చిమ తీరంలోని బెంటోటా (Bentota) వైపు ప్ర-యాణించాం. మార్గమధ్యంలో, సెయింట్ క్లేరా డావన్ జలపాతా-లను చూశాం. 'కిటుగుల' అనే ప్రదేశంలో 'కెలానీ నది' (Kelani River) లో తనివితీర జలకాలా-డాము ` అత్యంత రమణీయ ప్ర-దేశమిది. నదీ ప్రవాహం అతివే-గంగా ఉంటుంది. 'White River Rafting' కొరకు యాత్రికులు సాగర తీరంలోని 'బెంటోటా' చే-రుకున్నాం.

మరునాడు (ఎనిమిదవరోజు) దగ్గర్లోని 'కోసగోడ' (Kosgoda) ప్రాంతంలో సుగంధ ద్రవ్యాల తోటలు (Spice Gardens) చూశాం. ఇక్కడ పలు రకాలైన ఆయుర్వేద ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల చెట్లు పెంచ-బడుతాయి. ఈ ప్రాంతంలోని 'మూడు' నదిలో బోటింగ్ చేశాం. నదీ మధ్యలో అక్కడక్కడ చిన్న ద్వీపాల్లాంటి స్థలాల్లో ` ఏలకుల తోటలున్నాయి. ఈ ప్రాంతంలోనే అతి ప్రసిద్ధమైన Turtle Hachery (తాబేళ్ళ సంరక్షణ కేంద్రం)లో తా-బేళ్ళను పెంచే విధానం, రకరకాల తాబేళ్ళను సంరక్షణా నైపుణ్యా ప్ర-దర్శన చూశాం ` ఇదంతా సము-ద్రతీరం అయినందువల్ల చేపల, తాబేళ్ళకు సంబంధించిన సంర-క్షణా స్థలాలున్నాయి. శ్రీలంకలోని సముద్రతీరం (Beaches) లో ఈ ప్రాంతాలకు సందర్శకుల పోటు ఎక్కువ. దినమంతా వివిధ ప్రదే-శాలకు చూసి సాయంత్రం 1. కంద



విహార' (kande Vihara)అనబడే బుద్ధ / హిందూ ఆలయ సముదాయాన్ని సందర్శించాం. చారిత్రకంగాను, సాంస్కృతికపరంగాను అత్యంత ప్రాముఖ్యం కల్గిన ఈ ఆలయ ప్రాంగణం ` అతి విశాలమైంది. ఎత్తైన కొండపై ఉండి, అనేక దేవీదేవతలకు నిలయమైందీ ఆలయం.

మరునాడు (తొమ్మిదోరోజు) దేశ రాజధానైన కొలంబో మార్గంగా 'నెగోంబో' సాగరతీరం ప్రదేశానికి మా ప్రయాణం. దినమంతా 'కొలంబో' నగర సందర్శన..తెలుగువారి హోటల్లో మధ్యాహ్నం భోజనంచేసి నేషనల్ మ్యూజియంను సందర్శించాం. అనురాధపుర ప్రాంతంలోని (క్రీ.శ.300`500) బుద్ధ విగ్రహం మ్యూజియం ప్రవేశ ద్వారంలో అద్భుతంగా ఉంది. పాలొన్నారువ శిథిలాలలో లభించిన హిందూ, దేవీ దేవతల విగ్రహాలు కూడా ఇక్కడ భద్రపరచబడినాయి.

ముఖ్యంగా 12వ శతాబ్దం నాటి కాంస్య విగ్రహాలు (నటరాజస్వామి, శివపార్వతులు, నందీశ్వర, మొదలైనవి), ఆనాటి నాణ్యాలు (Coins), సింహాళరాజు శ్రీ విక్రమ రాజసింఘే వారి సింహాసనం, కిరీటం మనల్ని ఆకర్షిస్తాయి. మరో విభాగంలో శ్రీలంక గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి సంబంధించిన పనిముట్లు, ఆనాటి వారి జీవన విధానాలు వృత్తులకు సంబంధించిన చిత్రాలు, కళాఖండాలున్నాయి. తప్పక చూడవలసిన ప్రదర్శనశాల ఇది. తరువాత పాత, కొత్త పార్లమెంట్ భవనాల, అధ్యక్షభవనం చూసి కొంతసేపు 'ఇండిపెండెంట్ స్క్వేర్' (Independent Square) లో గడిపాము. తర్వాత



కొలంబో నగరానికే తలమానికమైన 'గంగారామ' బుద్ధమందిరం చూశాం. గంగారామ మందిరంలో బుద్ధ భగవానుని 'వెంట్రుక'(Hair) నేడు 'గాజు పాత్ర'లో భద్రపరచబడిరది. గర్భగుడిలో మనం చూడవచ్చు. ఇక్కడి ముఖ్య పూజారి 'జీనరత్న' మాట్లాడుతూ భారతదేశంలో గంగానది ఎంత పవిత్రమైనదో, శ్రీలంకలో గంగGఆరామ గంగారామ మందిరం అంత పవిత్రమైనదని తెలిపాడు. చూడముచ్చటైన స్థలమిది. దగ్గర్లోని 'బైరే సరస్సు' (Baire Lane)లోని 'సిమాన లంకన్' బుద్ధమందరం చూసి, 'బాలమురుగన్' మందిరానికి వెళ్ళా... కొలంబోలోని ప్రసిద్ధ దేవాలయంలో ఇది ముఖ్యమైంది. కార్తికేయస్వామి ఆలయంతోపాటు వివిధ దేవీదేవతల విగ్రహాలు ఆలయ ప్రాంగణంలో ఉన్నాయి. సూర్యాస్తమయ సమయానికి కొలంబోలోని అతి సుందరమైన 'గాలే ఫేస్ గ్రీన్' (Galle



Face Green) సముద్ర తీరంలో గడిపాం.
ఇక్కడ సముద్ర తీరంలో గంట-కుపైగా గడిపి, రాత్రికి నెగోంబో (negombeo) చేరుకున్నాం.
మరునాడు (పదవ రోజు) హోటల్ దగ్గర సముద్రతీరంలో కొంతసేపు గడిపి, అరవై కిలో-మీటర్ల దూరంలోని 'మన్వారి' (Manvari) అనే స్థలంలోని పురాతన శివాలయంలో సైక-తలింగాన్ని దర్శించాం. రావణ సంహారం తర్వాత బ్రహ్మ హత్యా పాతక నివారణార్థం, శ్రీరాముడు తన తిరుగు ప్రయాణంలో ఇక్కడి సైకత లింగ స్థాపన చేశాడని శ్రీ-రామునిచే స్థాపించబడిన మొ-ట్టమొదటి సైకతలింగమని చెబుతారు. గర్భగడిలో రాజరాజే-శ్వరీదేవి, శ్రీరామలింగేశ్వరస్వామి-వారి దివ్యదర్శనము మరుపురాని అనుభూతిగా మిగిలిపోతూంది. ప్రశాంతమైన వాతావరణంలో, నగరానికి దూరంగా ఈ ఆలయం ఆధ్యాత్మికతకు నిలయమైంది ` తర్వాత కొంత దూరంలో అతి ప్ర-సిద్ధమైన 'మనీశ్వర మందిరం' (చిలావ్ పట్టణ సమీపంలో) వెళ్ళాం. రావణ వధానంతరం శ్రీ-రాముడు ఇక్కడ శివుని పూజిం-చాడని అంటారు. అతి విశాల-మైన మందిరమిది. ఈ ప్రదేశం, ఆలయాలు 'రామాయణ కాలం నాటివే కాక, 'రామకథ'కు సం-బంధించినవైనందున ప్రాముఖ్యా-తను సంతరించుకున్నాయి.
ఆ రోజు సాయంత్రం 'నెగోంబో' నగర సందర్శన, సముద్ర తీరంలో గడిచిపోయింది. శ్రీలంక పశ్చిమ తీరంలోని సముద్ర తీరంలో 'నెగోంబ్' ముఖ్యమైంది.
మా సింహళయాత్రలో చివరి రోజు (11వ రోజు) ఉదయం హోటల్ యాజమాన్యం నిర్వహణలోని 'ప్రైవేట్ బీచ్'లో కొంత సమయం తర్వాత 'ఈత కొలను'లో గడిపి కొలంబో ఎయిర్‌పోర్టుకు బయ-లుదేరాం.
మార్గమధ్యంలో 'నేగొంబో' నగ-రంలోని అతిపెద్ద చేపల పరి-శ్రమ / మార్కెల్, పోర్ట్, మార్గం పొడువునా బ్రిటిష్‌వారు నిర్మించిన నీటి కాలువలను చూస్తూ కొలంబో విమానాశ్రయానికి చేరుకున్నాం.
కొలంబో ` మధురై`హైదరాబాద్ విమాన ప్రయాణంతో సాయంత్రా-నికి హైదరాబాద్ చేరుకున్నాం.
ఇలా పదకొండురోజులపాటు మా సింహళ (శ్రీలంక Pearl of the East)`యాత్ర. వైవిధ్యభరితం-గా సాగడం, మధురాను భూతిగా మిగిలింది.

# నూటపదహార్లు కందాల్లో సుందరకాండ



పాలెపు బుచ్చిరాజు

## మనవి

వాల్మీకి రామాయణం మహోత్కృష్టమైన కావ్యం. ఎవరె న్నిసార్లు రాసినా ఇంతకంటే ఎక్కువగా ఏం చెప్పగలరు? యావద్భారత దేశంలో ఎన్నో భాషల్లో ఎందరో మహానుభావులు రచించి, చదివి, విని ధన్యులయ్యారు. ఉత్తర భారత దేశంలో గోస్వామి తులసీదాసు రచించిన "రామచరితమానస్" కి ఉన్న ప్రాచుర్యం మరి దేనికీ లేదు. అఖండ రామాయణ పారాయణం, సుందర కాండ పారాయణం, హనుమాన్ చాలీసా ప్రతి రోజూ ఎక్కడో ఒక దగ్గర వినిపిస్తూనే ఉంటాయి. తెలుగులో కూడా వెయ్యేళ్ళుగా వేలాది భక్తులు రామాయణాన్ని రాసి, చదివి, విని తరించారు.

రామాయణంలో రాముడి తరవాత విశిష్టమైన పాత్ర హనుమది. స్వామి భక్తికి, కార్య దీక్షకి, బుద్ధికుశలతకి కొలమానంగా చిత్రించాడు వాల్మీకి. అసలు రామాయణంలో సుందర కాండ ప్రత్యేకంగా హనుమ కోసమే సృష్టించ బడింది అనిపిస్తుంది. సీతాన్వేషణలో హనుమ చేసిన అధ్భుత కార్యాలకి అబ్బురపడి శ్రీరాముడు "నువ్వు నా తమ్ముడు భరతుని వంటి వాడవ"ని ఆప్యాయంగా కౌగలించుకున్నాడు. భక్తి తత్వానికి ఉదాహరణగా రచించ బడింది కనుకనే సుందర కాండ ప్రత్యేకంగా పారాయణకి నోచుకుంది.

నాటి రామదాసు, త్యాగరాజు నుంచి, నేటి ఎం. ఎస్. రామారావుగారి వరకు ఎందరో మహానుభావులు శ్రీరామ హనుమలను కీర్తించడం ద్వారా ధన్యులయ్యారు.

వారిని స్ఫూర్తిగా తీసుకుని 'వంద కందాల్లో సుందర కాండ' రాద్దామనే ప్రయత్నం చేశాను. 'అష్టోత్తర శతం' దాటినా హనుమంతుని తోకలా పెరుగుతూ పోయింది. ఆఖరికి 'నూటపదహార్లు' తో పూర్తి చేయ గలిగాను. చదువరులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

ఆఖర్న అనుబంధంగా "పురజన గీత" గా పద్దెనిమిది కందాలు చేర్చాను. పట్టాభిషేకం తరవాత శ్రీరాముడు తమ్ముల్ని, మంత్రుల్ని, సామంతుల్ని, సైన్యాన్ని ఉద్దేశించి ఎవరెలా మసలుకోవాలో మాట్లాడాక, పుర ప్రజల్ని కూడా పిలిపించి వారికి భక్తి తత్త్వం బోధిస్తాడు. ఆ కారణంగానే దీనికి 'పురజన గీత' అని పేరు. తులసీ రామాయణం ఆధారంగా రాసిన పద్యాలు.

బరోడా

పాలెపు బుచ్చిరాజు

# పురజన గీత

## (అనుబంధము)

1) శ్రీరాముని దయ చేతను

దారాసుత సహితులై నిదానమునందున్

పేరొందిరి పుర జనములు

శ్రీరాముడు రాజ్యమేల శ్రీలకు కొదవే !

2) రాజనిన సేవకుడగును

రాజే తల్లియు పితయును రాజే గురువౌ

రాజే ప్రజలను ముక్తికి

దా జేర్చ దలచి సతతము దారులు చూపున్

3) అని తలచి మదిని రాముడు

వెనువెంటనె భటుల బిలచి వేగమె ప్రజలన్

తన సభలోనికి రమ్మని

తన యానగ చెప్పిరాగ తావుల కంపెన్

# దేవదేవుని పంచ భూత లింగాలు



## ఓం పృధ్వీ లింగం ` ఏకామ్రేశ్వరుడు


కొత్త రామానందం

'కథ కంచికి ` మనం ఇంటికి' అంటూ ప్రతి రసవత్తర గాథను, ప్రతి రమణీయ కథను చివరికి కంచికిచేర్చి మనం ఇంటికి మరలిరావడం, మనకు కథలు చెప్పే పెద్దలు అలవాటు! బహుశా, ఇందుకు ముఖ్య కారణం, పెద్దలు మనకు కంచి ప్రాముఖ్యాన్ని, ఘన చరిత్రను విశిష్టతను తరుచు తెలియచెప్పడం లేదా జ్ఞాపకం చేయడం అవసరమని భావించి ఉండటం వల్లనే కావచ్చు. కంచి క్షేత్రాన్ని మన ఋషులు మహిత 'మోక్షపురం'గా కీర్తించారు. మన దేశంలో మొత్తం 7 పురాలను 'మోక్ష పురాలు'గా విజ్ఞులు పేర్కొన్నారు. 'అయోధ్య, మధుర, మాయా, కాశీ, కంచి, అవంతికాపురి, ద్వారావతి 'శైవ సప్తయితే మోక్షదాయికా' అనే పురాతన సూక్తి ప్రకారం, అయోధ్య, మధుర, మాయా(హరిద్వార్), కాశీ, కంచి, అవంతిక(ఉజ్జయిని) ద్వారావతి(ద్వారక) ఈ ఏడు మోక్షాన్ని ప్రసాదించే పురాలు! ఆధ్యాత్మిక రాజధాని కంచి, కైలాస వైకుంఠాలు ఒకచోట కూడిన దివ్యక్షేత్రం. కంచిలో ప్రతిష్ఠితమైన కామాక్షిమాతకు, కమనీయమైన కంచికి అవినాభావ సంబంధం



ఉన్నది. నాయన్మార్ల నుంచి ఆళ్వార్ల వరకు ఆది శంకరుల నుంచి రామానుజుల వరకు ఎందరినో తన కడుపులో బెట్టుకొని ఆదరించిన అమృత హృదయ ఆధ్మాత్మిక ఉన్నతితోపాటు, అతిపురాతన చరిత్ర కలిగిన కంచి సందర్శనం ఒక అలౌకిక అనుభవం. ఒకప్పుడు శివపార్వతిలిరువురూ వినోదంగా పాచిక లాడుకుంటున్నారు. ఆటలో శివుడు ఓడిపోయాడట. అప్పుడు పార్వతీదేవి ఆయనను ఎగతాళి చేసిందట. శివునికి కోపం వచ్చి

నువ్వు అందవికారివి అయిపో' అంటూ అమ్మవారిని శపించారట. పార్వతి క్షమాపణ కోరి శాపవిముక్తిని సూచించమని శివుని అర్థించింది. భూలోకానికి వెళ్లి ఒక్కపండు మాత్రమే ఉన్న మామిడి చెట్టు (ఏకామ్రం) క్రింద కూర్చుని తపస్సు ప్రారంభించింది. శివుడామెను భయపెట్టి తపస్సు భగ్నం చేయడానికి తన జటాజూటంలోని గంగను వేగంగా ప్రవహింప చేసాడట. దాంతో పార్వతి భయపడిపోయి తన ఎదురుగా ఉన్న శివలింగాన్ని కౌగిలించుకున్నదట. అప్పుడు ఆమె పట్ల ప్రసన్నుడయ్యాడు. మొదట ఆమె విష్ణువు అనుగ్రహంతో అందవికారాన్ని పోగొట్టుకొని ప్రేమగొలిపే చక్కని కళ్ళతో అందాల సౌందర్యరాశి అయింది. తపస్సుతో శివుని మెప్పించి ప్రత్యక్షం చేసుకున్న పార్వతి తనతో పాటు ఆ ఒంటిపండు మామిడి చెట్టు క్రిందే ఉండిపొమ్మని శివుని కోరిందట. శివుడు అలాగే ఉండిపోయాడు. అందుకే శివుడికి ఇక్కడ ఏకామ్రనాథుడు, ఏకామ్రేశ్వరుడు, ఏకాంబరుడు, ఏకాంబన్ అనే పేర్లు వచ్చాయి. ఈ ప్రదేశానికి పశ్చిమంగా ప్రవహిస్తున్న 'కంచై' నదిని బట్టి శివునికి 'ఏకాంబన్' అనే పేరు వచ్చిందని కొందరంటారు. స్వామివారి ఆవిర్భావమునకు సంబంధించిన ఒక పురాణగాథ ప్రచారంలో ఉంది. హిమాలయాలలోని బదరికాశ్రమనివాసి అయిన కాత్యాయన మహర్షి సంతానం కోసం మహదేవుని గూర్చి తీవ్రమైన తపస్సు చేశాడు. శివుడి అనుగ్రహం వల్ల సాక్షాత్తు పార్వతీదేవే ఆ మహర్షి కుమార్తెగా అవతరించి మురిపెంగా ప్రాకుకుంటూ వచ్చి ఆయన ముందు ప్రత్యక్షమవుతుంది. ఆ రహస్యం గ్రహించిన మహర్షి తన జన్మ ధన్యమైనట్టు భావించి, ఆ దేవతని యుక్త వయసు దాకా పెంచి, ఆమె ప్రియసఖుని పెళ్లాడడానికి గాను పుణ్యస్థలమైన కంచికి వెళ్లమన్నాడు. కారణ జన్మురాలైన కాత్యాయని దక్షిణ భారతం చేరి తన పయనం కొనసాగిస్తూ కంచిక్షేత్రం చేరి శివుని తన హృదయేశ్వరునిగా ఎంచుకొని ఆయనను పొందేందుకు గాను తపమాచరింప తలచింది. ఒక అపురూపమైన మామిడి వృక్షం నీడలో తపస్సు చేయ-





దలచి ఆ జగన్మాత సూదిమొనపై నిలచి ఇసుక లింగానికి పూజ చేయడం ఆరంభించింది. అయితే శివుడు ఆమెను పరీక్షించదలచి గంగచేత ఆ ప్రదేశాన్ని ముంచెత్తించాడు. ఆమెతో ఉన్న చెలికత్తెలు ఆ వరద ఉధృతాన్ని ఆపలేకపోయారు. వరద నుంచి రక్షించమని విష్ణువును అర్థించింది. మహావిష్ణువు విశ్వరూపం ధరించి గంగ పొంగును పూర్తిగా నిరోధించాడు. ఇంత వరద వచ్చినా అచ్చట ఇసుక లింగం గాని, మామిడి చెట్టు గాని చెక్కు చెదరక స్థిరంగా నిలవడం చూసి ఆశ్చర్యానికి లోనయింది. ఇసుక రూపంలో ఉన్న స్వామి తన ప్రాణనాథుడు శివదేవుడే అని గ్రహించి ఆస్వామిని గాఢంగా అలింగనం చేసుకొంది. ఆ పరమేశ్వరుడు సంతోషించి తన నిజరూపం దాల్చి` కాత్యాయిని రూపంలోన ఉన్న పార్వతీదేవిని పరిణయమాడెను. ఈ విధంగా అది దంపతులైన శివపార్వతుల కల్యాణ వేదికగా నిలిచిన కమనీయ సీమ కంచి. కంచి శివకేశవులిరువురికి సంబంధించిన క్షేత్రమని స్పష్టం చేస్తుంది. ఇక్కడ కామాక్షి ఏకామ్రనాథుడెంతో, వరద రాజస్వామి కూడా అంతే. పట్టణానికి తూర్పున వరదుడు కొలువైతే పశ్చిమాన ఏకామ్రనాథుడు కొలువై ఉంటాడు. శివుడున్నది శివకంచి విష్ణువున్నది విష్ణుకంచి. ఇలా శైవ వైష్ణవుల కుభయులకూ కంచి ముఖ్య క్షేత్రం. అయోధ్యా, మధుర, కాశీ, అవంతి, ద్వారక, హరిద్వార్‌లతోపాటు కంచిని కూడా మోక్షనగరంగా పేర్కొంటారు. వీటిలో మూడు శివునికీ, మూడు విష్ణువునికీ ప్రధాన క్షేత్రాలైతే కంచి ఇరువురికి ముఖ్య క్షేత్రమని మొదటి నుండి భావన.

## ఏకామేశ్వర ఆలయం:

ఈ ఆలయానికి దక్షిణం వైపు ఉన్న 9 అంతస్తులతో 60 మీటర్ల ఎత్తుకు ఎగసిన కళాత్మకమైన రాజగోపురం ప్రధాన ప్రవేశ ద్వారం అత్యంత సుందరమైన ఆలయ గోపురంగా అలరారుతున్నది. ఈ గోపురాన్ని 1,509 సం॥లో శ్రీ కృష్ణదేవరాయులు నిర్మింపచేసారు. చోళులు, పల్లవులు ఈ ఆలయాన్ని అభివృద్ధి పరిచారు. వారందరి కృషితో ఆలయానికి నూతన శోభ చేకూరింది. సమున్నతమైన వైభవ గోపురాలు, కల్యాణ మండపాలు శిల్పకళా సంపన్నంగా తయారయ్యాయి. వారి దైవభక్తి, కళాశక్తి ప్రశంసనీయమైనది. ప్రధాన రాజగోపురం నుంచి లోనికి ప్రవేశించిన భక్తులు తమ ఎడమవైపున వెయ్యిస్తంభాల మండపం, ఎదురుగా సర్వేశ్వర



మండపం అక్కడికి చేరువలో-నే పుణ్యతీర్థం కనపడతాయి. ఆ సర్వేశ్వర మండపం పై కప్పుపై అనేక ఆకృతులు చిత్రీకరింపబడ్డాయి. అందులో నేటికి అత్యంత సుందరంగా (1) ఆనంద తాండవం చేస్తున్న నటరాజస్వామి మరియు (2) ఆంజనేయస్వామి చిత్రాలు భక్తులు తిలకించి నయనానంద భరితులౌతారు. ఈ ప్రాంతంలో ఒకప్పుడు కంపానది ఉద్భవించింది. ఆలయంలో గంగానది పొంగి పొరలినప్పుడు కాత్యాయిని కంపన (భయంచెందింది) ఆ కంపానది నేటి కలియుగంలో కృశించుకుపోయింది. ఉన్న కొద్ది గంగ తటాకంగా తయారైయిందని అంటారు. ఈ తటాకాన్ని ఈ ఆలయంలో అతి సుందరంగా తీర్చిదిద్దారు. మహిమల మామిడిచెట్టు: ఆలయ తొలి ప్రదక్షిణ మార్గంలో గంగ పొంగును నిరోధించిన మహితశక్తి మందిరం, పక్కనే సోమస్కంద నిలయం ఉన్నాయి. విఖ్యాతి గాంచిన మామిడిచెట్టును తిలకించవచ్చును. ఈ వృక్షం నీడ క్రిందే పార్వతీమాత పరమేశ్వరుని సాక్షాత్కారానికై తీవ్రమైన తపస్సు చేసిందంటారు. ఈ చెట్టు వేదకాలం నాటిదనియు, దీని వయసు నిర్ధారించలేమనియు అంటున్నారు. గతంలో ఈ వృక్షానికి ఉన్న నాలుగు కొమ్మలకు నాలుగు విభిన్న రుచులు ` తీపి, చేదు, వగరు, పులుపు గల పళ్ళు కాచేవట. వీటిని తిన్నవారికి సకల సౌభాగ్యాలు,సంతానప్రాప్తిలభించేదట. నేడు ఈ మామిడి చెట్టు కింద కాత్యాయని అమ్మవారి విగ్రహం, సమీపంలో శివస్వామి సుందర లింగ రూపాన్ని చూసి భక్తితో అందరు నమస్కరిస్తారు. యీ తొలి ప్రదక్షిణ మార్గంలో వివిధ ఆకృతుల లింగాలు, అన్నింటినీ మించి 1,008 లింగాలతో కూడిన సహస్ర లింగం అపురూపంగా తిలకిస్తుంటారు. 1,008 నామాలు సంకేతంగా ఒకే లింగంపై 1,008 లింగాలు చక్కగా రూపొందించారు. ప్రదక్షిణ` దక్షిణ భాగంలో 63 మంది ప్రముఖ నయన్మార్ల ప్రతిమలను చూడవచ్చును. ఆ మార్గంలోనే గంగ వరద ఉధృతిని తన విశ్వరూపంతో నిరోధించిన విష్ణుమూర్తి వారి సన్నిధి ఏకాంబరనాథునికి ఎదురుగా ఉంది. విశ్వరూప ధారణ సమయంలో విష్ణుదేవుని కంఠంపై చంద్రకాంతి మెరిసినందున ఆ స్వామిని ''నీలతుండ పెరుమాళ్'' అంటారు. ఈ విశేషా-

న్ని తెలియజేయడానికి శివ`విష్ణు దేవుల మధ్య భేదం ఏమిలేదని, వారిరువురు ఒకటేనని ఆపరమాత్ముని స్వరూపాలేనని వెల్లడిరచడానికిగాను శివాలయంలో విష్ణునిలయాన్ని ఏర్పాటుచేశారు. ఏకాంబరేశ్వరుని సన్నిధి: సైకతలింగం రూపంలో ఉన్న ఈ స్వామి బహుసుందరంగా కానవస్తాడు. ఆ దివ్య లింగాన్ని పూర్తిగా వెండి తొడుగుతో కప్పివేశారు. అంతేకాదు అభిశేకాలకు దీటుగా లింగానికి నీరు అంటని గుణం కలిగిన పునుగుతో తయారు చేసిన ఒక ప్రత్యేక తైలాన్ని పూస్తారు. స్వామిపై కప్పున ఉన్న గోపురాన్ని 'రుద్రకోటి విమానం' అని పిలుస్తారు. భూలోకంలో కాల ప్రభావం వలన, కలి మాయవలన వైభవ దేవతామూర్తులు కూడా కొంత కాలం ఇతర స్థలాలలో తలదాచుకోవలసిన విపరీత పరిస్థితి వచ్చింది. శ్రీరంగనాధుడు తిరుమలలో, చిదంబర నటరాజస్వామి తిరువారూరులో కొన్నేళ్లు, యుద్ధ పరిస్థితుల వలన నివాసం ఉన్న విశేషం తెలిసిందే. అదే తీరులో కంచిలో వైరి రాజుల మధ్య పోరాటాలు జరుగుతున్నా సమయంలో 25 సంవత్సరాలపాటు ఏకాంబరేశ్వరునికి జంబుకేశ్వరంలో తాత్కాలిక నివాసం ఏర్పాటుచేశారు. ఏకాంబరేశ్వరుడు నిత్యోత్సవాల దేవుడు. ఆలయంలో నిత్యం పండుగ వాతావరణం కానవస్తుంది. ఇక్కడ నిర్వహింప బడే ప్రధానమైన ఉత్సవం ` 'పంగుణి ఉత్తిరం' పాల్గుణమాసంలో పౌర్ణమినాడు అత్యంత వైభవంగా దివ్య కళ్యాణాన్ని నిర్వహిస్తారు. లక్షలాది భక్తులు ఈ వేడుకలలో పాల్గొంటారు. ఆరోజు జరిపించే మావడిసేవ, వెండి రథంపై ఊరేగిస్తారు. దేశం నలుమూలల నుంచి భక్తులు ఈ ఉత్సవాలలో పాల్గొనటం ఒక ఆనవాయితీగా వస్తుంది.

విష్ణు కంచి: కంచి పట్టణానికి తూర్పున కంచి వరదరాజస్వామి ఆలయం ఉన్నది. శ్రీ వరదరాజస్వామి ఆలయం ఒక కొండగుట్టపైన ఏర్పడిరది. ఆలయం గోడలపై ఎన్నో శాసనాలు కనిపిస్తాయి. శ్రీకృష్ణదేవరాయులు వంటి విజయనగర రాజులు కంచి వరదుని భక్తితో సేవించి విలువైన అనేక కానుకలు, అగ్రహారాలు ఇవ్వడమే కాక మరికొన్ని విష్ణ్వాలయాలు ఇక్కడ నిర్మింపజేశారు. ఆంగ్ల సేనాని రాబర్ట్‌క్లైవ్ కూడా వరదరాజస్వామికి ఒక విలువైన స్వర్ణ హారాన్ని బహూకరించాడు. వరదరాజస్వామి ఆలయం ఒక అద్భుత నిర్మాణం. ఆలయముందు భాగాన ఒక పుష్కరిణి, దాని ప్రక్కన కల్యాణ మండపం ఉన్నాయి. ఇక్కడ భక్తులు ప్రత్యేకంగా బంగారు, వెండి బల్లులను తాకుటకు ఆశక్తి చూపుతారు. ఆలయంలోని బల్లుల్ని తాకితే బల్లి పడిన దోషం పోతుందని నమ్మకం. ఇక్కడ బల్లుల్ని తాకి వచ్చిన వారిని ఇతరులు తాకే ఆచారం కూడా ఉంది. వరదరాజస్వామివారు గర్భాలయంలో చతుర్భుజాలతో, స్థానిక భంగిమలో నిలబడి కొలువు తీరి శంఖ, చక్ర, గధ, అభయ ముద్రలను చేతులలో ధరించి దివ్య మనోహరమూర్తిగా భక్తులకు దర్శన మిస్తుంటారు. ఆలయ ప్రాంతాన్ని 'హస్తిగిరి' అని భక్తులు పిలుస్తారు. నిజానికి ఈ ప్రదేశాన్ని 'అత్తిగిరి' అని పిలవాలి. పూర్వం బ్రహ్మ గారు స్వామి వారి మూల విగ్రహాన్ని అత్తి కలపతో తయారు చేశారు. మూల విరాట్ పుష్కరిణి నీటిలో అడుగున వేలాడే పెట్టిలో భద్రంగా ఉంచుతారు. ప్రస్తుత పూజలందుకుంటున్న `స్వామి విగ్రహాన్ని పళయసీవరం గ్రామం నుంచి తీసుకువచ్చి ప్రతిష్టించారు. శ్రీరామానుజుల వారి ఆదేశం మేరకు 40 సంవత్సరముల కొకసారి బయటకు తీసి ఒక విశాలమైన మండపంలో భక్తుల దర్శనార్థం 40 రోజులు ఉంచుతారు. దేశం నలుమూలల నుంచి భక్తులు 'ఆదివరదర్' విగ్రహాన్ని కనులారా తిలకించుటకు వేంచేస్తారు. 2019 సంవత్సరంలో 'ఆదివరదర్' విగ్రహాన్ని బయటకు తీసి పూజలు నిర్వహించారు. వరదరాజస్వామి వారి దేవరి పేరు పేరిందేవి తాయారు ఆమె వరదముద్రతో రెండు చేతులలో పద్మాలను ధరించి దర్శనమి-



స్తూ 'భక్తుల మనోభీష్టాలను' నెరవేరుస్తుంటారు. ఆమె ఎల్లవేళలా గర్భగుడికి పరిమితమై ఉంటారు. వారు ఊరేగింపులలో పాల్గొనరు. ఈ వరదరాజస్వామి ఆలయంలో వైశాఖమాస ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తుంటారు. 10 రోజులపాటు జరుపబడే ఈ ఉత్సవాలలో వివిధ వాహన సేవలు నిర్వహిస్తుంటారు. ఇక ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశినాడు కృష్ణాష్టమి, సంక్రాంతి సమయాలలో ప్రత్యేక అలంకరణలు,పూజలు నిర్వహిస్తుంటారు.

కంచికామాక్షి ఆలయం: అమ్మవారి ఆలయం ఏకాంబరేశ్వర ఆలయానికి సుమారు ఒక కిలోమీటరు దూరంలో ఉన్నది. ఇచ్చట స్థానికులు 'కామ కొట్టం కామాక్షి అమ్మన్ ఆలయం'గా వ్యవహరిస్తుంటారు. కామకొట్టం అనేది ఈ ప్రదేశం యొక్క పాతపేరు. కంచి కామాక్షి అమ్మవారి దర్శనం నిమిత్తం భక్తి ప్రపత్తులతో తమవెంట పసుపు కుంకుమలు, పూలు, పండ్లు, చీర తీసుకొని వెళ్లి, పూజలు చేయించి తీర్థప్రసాదాలు స్వీకరిస్తారు. అమ్మవారు ఆదిపరాశక్తి అద్భుత అవతారమైన దివ్య మంగళ స్వరూపం. ఎల్లవేళలా భక్తులను కేవలం అక్షి(నేత్రములు)తోనే వాత్సల్యం కురిపించి, ఆశీస్సులు అందజేసే కరుణామయి.ఆమె 'బంధకాసురుడు' అనే దానవుని, దేవతల విన్నపము మేరకు సంహరించింది. నేడు ఆలయంలో ఆమె ప్రసన్న చిత్తశాంత స్వభావినిగా రూపం దాల్చి అందరి కోరికలు తీర్చుచున్నది. కామాక్షిదేవి ఆలయం చక్రపీఠ రూపంలో తీర్చిదిద్దబడిరది. ఆదిశంకరాచార్యులు వారు శ్రీ చక్రాన్ని అమ్మవారి దివ్య విగ్రహానికి ప్రతిష్టించారు. ఆమె గర్భాలయంలో పద్మాసనంలో నాలుగుచేతులతో పాశం, అంకుశం, చెరుకుగడ, ధనస్సు పుష్పబాణాలను ధరించి కరుణామృతాన్ని వెదజల్లుతూ దర్శనమిస్తుంది. ఆమె దర్శనం ఒక మహత్ భాగ్యంగా భావిస్తారు. ప్రతి శుక్రవారం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని శుక్రవార మండపంలో ఉంచి విశేష పూజలు నిర్వహిస్తుంటారు. ఈ మండపం చెంత దూర్వాస మహాముని విగ్రహం నెలకొల్పబడిరది. దూర్వాసుడే

ఆలయంలో ఆచరించవలసిన పద్ధతులు, నియమాలు రూపొందించగా వాటిని నేటికీ అమలు జరుపుతున్నారు. దూర్వాస విగ్రహం పక్కనే దత్తాత్రేయుని తల్లిదండ్రులైన అనసూయ అత్రి మహర్షుల విగ్రహాలు ఉన్నాయి. అమ్మవారి గుడిలో సరస్వతి, స్వర్ణ కామాక్షి, వినాయక, అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర, మహిషాసురమర్థిని, సుబ్రహ్మణ్య స్వామి తదితర ఉప ఆలయాలను చూడగలము. ఇచ్చటి వినాయకుని పూజిస్తే భక్తుల కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ఇక్కడ కొందరు భక్తులు 'సంతాన స్తంభం' చుట్టూ ముమ్మారు భక్తి శ్రద్ధలతో ప్రదక్షిణ చేస్తే వారి కోరికలు నెరవేరుతాయని నమ్ముతారు. అమ్మవారికి మాఘమాసంలో జరిగే బ్రహ్మోత్సవాలలో, అశ్వయుజమాసం జరిగే శరన్నవరాత్రి ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో అమ్మను ఆరాధిస్తారు. ఇతర నెలలో అమ్మవారిని దర్శించుటకు మంగళవారం, శుక్రవారం, ఆదివారం రోజులు ఎంచుకొని ఆలయ దర్శనానికి కుటుంబ సమేతంగా వస్తారు. ఆ తల్లిని నమ్ముకుంటే అన్నీ సమకూరుతాయి. నడిచే దైవంగా, అపర శంకరులుగా, ఆధ్యాత్మిక తేజోపుంజంగా కీర్తిపొంది శత వర్షాలు జీవించిన శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి వల్ల చరితార్థమైన శ్రీ కంచికామకోటి పీఠం చక్కటి సాంఘిక సేవలు, వేద పాఠశాలలు, డిగ్రీకళాశాలలు నిర్వహిస్తోంది

ఓం నమశ్శివాయ

# గురు శిష్యులు

( 9 వ పేజీ తరువాయి )

నాయనా, నీచేత గడ్డి కోయించా, పశువులు మేపించా. అన్ని కులవృత్తుల వారిదగ్గరా నీతో ఊడిగం చేయించా. కానీ నువ్వు అవన్నీ దేనికని ప్రశ్నించకుండా పాటించావు. అయినా నీకు నేను చెప్పాలి... అదంతా ఎందుకు చేశానో. నువ్వొక గొప్ప రాజువి కావాలంటే ప్రతి వృత్తిలో ఉండే కష్టాలు నష్టాలు నీకు తెలియాలి. స్వయంగా అనుభవించి తెలుసుకోవాలి. మిగతా నీతోటి విద్యార్థులు సామాన్యులు. వారికి తగుమాత్రం విద్య చాలు పొట్టపోసుకోవడానికి. నీకలా కాదు.రాజనేవాడికి అంతులేని పరాక్రమమే కాదు, అంతులేని సహనం ఉండాలి, సమర్థత ఉండాలి. సమస్య ఎక్కడుందో తెలుసుకుని పరిష్కరించే తెలివితేటలుండాలి. అవన్నీ పుస్తకాల్లో వ్రాయబడి వుండవు. నీ పుస్తకంలో నువ్వే నీ అనుభవాల్ని నిక్షిప్తం చేసుకోవాలి. అందరికీ అయిదారు గంటలు శిక్షణ ఇచ్చా. నీకు మాత్రం రోజుకి పద్దెనిమిది గంటలు పనిగంటలుగా చేసేవాడ్ని. రాజు అప్రమత్తంగా ఉండాలి. సోమరితనం పనికిరాదు. క్షణాలమీద నిర్ణయాలు తీసుకోవాలి. అవసరమైన తక్షణం రంగంలోకి దిగాలి. అందుకే నీ శరీరానికి శ్రమ ఇచ్చి నిన్ను యోధుడిగా మార్చింది. నీవంటి శిష్యుడ్ని పొందటం నా సుకృతం" అన్నాడు జ్ఞానకౌశికుడు, మరోసారి రంతిదేవుడ్ని అక్కున చేర్చుకుంటూ. రంతిదేవుడికి కంటి వెంట గంగా యమునలు ప్రవహిస్తూ ఉండగా గురువు పాదాలమీద వాలిపోయాడు. 'గురుబ్రహ్మ గురువిష్ణు, గురుదేవో మహేశ్వరః' అనే శ్లోకం ఆశ్రమమంతా ప్రతిధ్వనించడమే కాదు రంతిదేవుడి అణువణువునా నిండిపోయింది.

మళ్ళీ కలుద్దాం.

మీ భువనచంద్ర

# భాగవత వీక్షణం

ఎలక్ట్రాన్



మనిషి మంచివాడు కావొచ్చు. అలాగని దేవుడిమీద నమ్మకముండాలని ఎక్కడా లేదు. మనిషి చెడ్డవాడు కావొచ్చు. చెడ్డవాడికి దేవుడిమీద నమ్మకముండకపోవచ్చని అభిప్రాయం కలగడం చాలా సహజం. అయితే దుష్కార్యాలు చేస్తూనే దేవుడికి దండాలూ, ముడుపులూ సమర్పించుకొనేవారికి కొదవలేదు. ఓసారి గుడిచుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి, దైవదర్శనం చేసుకొని, చెంపలు వాయించుకొని, తిరిగి తనకు అలవాటైపోయిన గతమార్గంలోనే పోయేవారు అధికులే ఉంటారు. నాస్తికులనేవారు ఇరువర్గాలలోనూ ఉంటారు. అయితే అధికశాతం జనాల్ని సన్మార్గంలో పయనించేటట్లు చేయడమే ధ్యేయంగా సమాజమే భగవంతుణ్ణి సృష్టించిదన్న వాదనకూడా ఉంది. దేవుడున్నా, లేకపోయినా ఓ రకమైన భక్తితో కూడిన భయం ఉండడం సమాజానికి మంచిదే. విజ్ఞానశాస్త్రాన్ని ఔపోసన పట్టి హేతువాదాన్ని వినిపించే విజ్ఞులు -మరణం తర్వాత ఏమీ లేదన్న సిద్ధాంతాల్ని కూడా ప్రచారం చేస్తారు. నేరాలు చేసి న్యాయవ్యవస్థనుంచి అవలీలగా తప్పించుకొనేవారికి ఈ సిద్ధాంతాలు కర్ణపేయంగా ఉంటాయి.

ఒక్కొక్క పుట్టినరోజు మనల్ని మరణానికి దగ్గరగా చేరుస్తుందన్నది వాస్తవం. సాధారణంగా నలభైలు దాటేసరికి ఈ భయం క్రమేపీ మనసులో విస్తరిస్తూ ఉంటుంది. నెమ్మదిగా ఆస్తికత్వంవైపు అడుగులు వేయడం జరుగుతుంది. అవటానికి నేను ఓ విజ్ఞానశాస్త్రవేత్తని. సాంకేతిక నిపుణుణ్ణి. చిన్నప్పుడు, అంటే నేను ఉన్నతపాఠశాల చదువు పూర్తిచేసేవరకూ మా ఊరి వెంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో ధనుర్మాసాలలో జరిగే దశావతార ఉత్సవాలకి, హరికథలకీ అర్ధసంవత్సరపు పరీక్షలు జరుగుతున్నా ఇంట్లోవారి కన్ను కప్పి వెళ్ళేవాణ్ణి. శ్రవణం ద్వారా రామాయణ, మహాభారత,భాగవతాల్ని గురించి





చాలా అవగాహనే కలిగింది. దేవుడనేవాడున్నాడని, రాముడూ, కృష్ణుడూ, విష్ణువుయొక్క అవతారాపురుషులనీ, బీజం పడింది. అయితే పోనుపోనూ కళాశాలలో అడుగుపెట్టిన తర్వాత, ఆలోచనల తీరులో మార్పు వచ్చింది. వేదాలు ప్రకృతి శక్తులను గురించీ, ప్రాచీన విజ్ఞానపరమైన విషయాల గురించీ ప్రస్తావించాయి కాని, దేవుళ్ళని గురించికాదని తెలిసింది. అయితే విజ్ఞులైన మునులు అనేకానేకమైన పురాణాలని రచయించి, దేవతల, రాక్షసుల పాత్రలు సృష్టించి, శాపాల రూపేణా దుష్టశిక్షణా, వరాల రూపేణా శిష్టరక్షణా, ఇత్యాదిని అత్యంత ప్రతిభావంతంగా ప్రస్తావించి మన భారతీయ సమాజంలో దైవప్రతిష్ఠాపన చేశారనిపించింది. అందుచేత మనకి ఇతర మతాలవలే కాక ముక్కోటి దేవతల రూపకల్పన జరిగిపోయి ఉండాలి. అయితే ఆదిశక్తిచే సృష్టించబడిన బ్రహ్మ,విష్ణు,మహేశ్వరులే ప్రధాన దేవతలుగా పరిగణింపబడ్డారు. పురాణాలలో వీరి దర్శనం పునఃపునఃగా జరుగుతుంది. వీరి అనేకమైన అవతారాల అద్భుతాలు చెప్పడం జరుగుతుంది.

ఉద్యోగ నిర్వహణలో ఆధ్యాత్మకతకి దూరంగా అడుగులు వేసినా, పిన్నవయసులో పడిన ముద్రలు నన్ను మంచిమార్గంలోనే నడిపించాయనుకోవడంలో స్వోత్కర్ష లేదు. అందుకనే నలభైలు దాటుతోండగా దైవచింతన నాలో అధికమైందని చెప్పుకోవడంలోనూ సిగ్గుపడటల్లేదు. పురాణాల గురించి అవి కాకమ్మ కథలని ఎవరైనా పరిహసిస్తే అవి సమాజ ప్రవర్తనలనీ, పరివర్తనలనీ నాగరికతల్ని నిర్వచిస్తాయనీ, గ్రీక్, మాయన్ పురాణాలుకూడా అందుకు నిదర్శనాలని వాదించేవాణ్ణి. చిత్రనిర్మాతలు తీసిన పురాణ, జానపద చిత్రాల్ని సంభావ్యతని గురించి ప్రశ్నించకుండా, ఓ రకమైన కుతూహలంతో చూసేవాణ్ణి. ప్రత్యక్ష నాటక ప్రక్రియల కావలగా, తెరమీద సాంకేతిక ప్రమాణాలతో దృశ్యశ్రవణాల మేళవింపు తర్వాత, నట్టింట బుల్లి తెర నిల్చున్న తర్వాత, సమాజ స్వరూపమే మారిపోయిందనుకోవాలి. దూరదర్శన ప్రసారవాహినులు జీవితాల్లో ఒక భాగమై కూర్చున్నాయి. అన్నీ వయసులవారికీ, ఎన్నో అభిరుచులు కలవారికీ ఎనలేని ప్రక్రియలు ప్రసార మాధ్యమాల్లో చోటు చేసుకొన్నాయి.

నాకు పదవీ విరమణ జరిగింది. గోదావరి తీరాన ఓ పట్టణపు శివార్లలో ఉన్న అద్దె కొంపలో తాత్కాలిక నివాసం ఏర్పరుచుకొన్నాను. ఉద్యోగరీత్యా రాష్ట్రాలు పట్టి తిరిగిన మాతో- ఆచారవ్యవహారాలు కొనసాగవన్న నెపంతో మా అమ్మగారు మా రెండో అన్నగారి వద్దనే ఉండిపోయింది. పదవీ విరమణ తర్వాత, మా అమ్మగార్నీ, నా శ్రీమతి తప్ప ఇతర సంతులేని

మా అత్తగార్నీ మాతోనే ఉండేటట్టు చేసుకొన్నాను. వారిద్దరిమధ్యా నెలకొన్న సయోధ్య స్నేహానికి నిర్వచనమని చెప్పుకోక తప్పదు. బుల్లి తెరమీద ఉదయపు వేళలో వచ్చే ఆధ్యాత్మిక ప్రసంగాలు, ప్రవచనాలూ తొంభైలు దాటిన మా అమ్మగారూ, ఎనభైలు దాటిన మా అత్తగారూ చూస్తూ 'బుద్బుదప్రాయమైన ఈ జీవితాలకోసం ఎందుకీ తపన?" అని వారు వైరాగ్య ధోరణిలో మాట్లాడుకొనే విషయాలు నా చెవినపడేవి.

సరిగా అప్పుడే ఓ ప్రముఖ ప్రసారవాహినీ సంస్థ బాపూ, రమణల నిర్దేశికత్వంలో భాగవతాన్ని ధారావాహికగా ప్రసారం చేస్తామని ప్రకటించింది. తర్వాత తేదీ వెలువరించింది. ఆ రోజుకోసం అందరం ఎదురు చూశాం. మా అమ్మగారూ, అత్తగారూ సూర్యోదయానికి మునుపే లేచి స్నానం చేసి, సోల కంచు గ్లాసుల్లో ఫిల్టర్ కాఫీ తాగి, బుల్లి తెరముందు ఎదురుగా ఉన్న రెండు పేముకుర్చీల్లో కూర్చున్నారు. భాగవత ప్రసారం మొదలైంది. అయిదు నిముషాలు కాకమునుపే ప్రకటనల విరామం. మా అమ్మగారూ, అత్తగారూ కళ్ళు మూసుకొన్నారు. నేను లేచి బయటకు వెళ్లాల్సివచ్చింది. అరగంట కార్యక్రమంలో రెండుమూడు సార్లు బుర్రలు మరోవైపు తిప్పాల్సి వచ్చిందని శ్రీమతి చెప్పింది. 'చ, ఛ! ఆచ్ఛాదన లేని ఎదలు (..మ్ములు) చూపి, సొమ్ములు చేసుకోనే ఈ సంస్కృతినేమనాలి? మన చిన్నతనంలో జరిగే మేజువాణీలు చాలా హుందాగా ఉండేవి!' అన్న మా అమ్మగారి మాటలుకూడ నాతో చెప్పింది. ఆ మరుచటి దినం నుంచి ఆ ప్రసారం వస్తున్నప్పుడు నేను టీవీ చూడ్డం మానుకొన్నాను. ముగ్గురు ఆడవాళ్ళూ ఇక చీకూ చింతా లేకుండా భాగవత ప్రసారాన్ని చూడసాగారు.

అయిదో రోజున ఇంటాయన పలకరించాడు. "మాది ఎప్పుడో కొన్న బ్లాక్ అండ్ వైట్ టీవీ. మీది కలర్ టీవీ. మీకు అభ్యంతరం లేకపోతే భాగవత ప్రసార సమయంలో నేనూ, నా శ్రీమతీ, నా పిల్లలూ వచ్చి మీ కలర్ టీవీలో చూడొచ్చా?" అని అడిగాడు.

నాకు ఏమనాలో తోచలేదు. అంత్యనిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరమే మంచిదనుకుంటూ నా క్రమవర్తన గురించి చెప్పి, "మీ శ్రీమతిగారిని వచ్చి నిరభ్యంతరంగా చూడమనండి. కానీ అందరూ వచ్చి చూస్తామంటే మా అమ్మగారికీ, అత్తగారికీ ఇబ్బందికరంగా ఉంటుంది. ఏమీ అనుకోకండి." అని చెప్పేశాను.

"మీరన్నమాట నిజమే! పారదర్శకమైన వలువలతో విలువలు దిగజార్చి చూపించే ప్రసారమధ్యమాల ధోరణులు ఆందోళనకరంగా మారుతున్నాయి, కాదనను. నేనూ ఓ కలర్ టీవీ కొనందే మా ఇంట్లో అలజడి రేగుతుంది! సాయంత్రం నాతోబాటు బజారుకి రండి. మంచి కలర్ టీవీ ఎంపికలో సహాయపడుదురుగాని," అన్నాడు.

ఆయనకి మనసారా కృతజ్ఞతలు తెలుపుకొన్నాను.


కొంతకాలం తర్వాత వృద్ధులిద్దరికీ పిలుపొచ్చి కైలాస భూములద్వారా వైకుంఠ ద్వారాలు వెతుక్కొంటూ వెళ్ళిపోయారు. సంవత్సరాలు గడిచాయి. ఇప్పుడు నేను వక్రీకరించబడిన భారత చరిత్రను గురించికాక, అసలైన సిసలు భారత చరిత్ర మీద వస్తూన్న ఎన్నో పుస్తకాలు చదువుతానేకాని, ప్రసారమాధ్యమాల కేసి దృష్టి సారించను. ఎందుకంటే వృద్ధాప్యం కారణంగా కొడుకుల పంచన వంతులవారిగా నివసించే మాకు, తరాల అంతరాలు అడ్డుగా నిలుస్తాయి మరి.

***

# ఉద్యమ హృదయం కలిగిన కవి డా.నందిని సిధారెడ్డి



తుమ్మూరి రాంమోహనరావు



ప్రపంచసాహిత్యం ఏదైనా 'మనిషి' కేంద్రంగా రాయబడిందే. మనిషి నడవడి మార్చడానికో, మనిషి మనుగడ తీర్చడానికో, మనిషి చరిత్రను చెప్పడానికో, మనిషి గుట్టును విప్పడానికో, కథైనా, కవిత్వమైనా, నవలైనా, నాటకమైనా, ప్రక్రియ ఏదైనా మనిషి స్థితిని మెరుగు పరచడానికేనన్నది కాదన లేని సత్యం. అనేక మంది కవులు రచయితలు తాము చెప్పదలచుకున్నదాన్ని చెప్పడం వరకే కాని, చేయడం వరకు వచ్చే సరికి వెనకడుగు వేస్తారు. మరి కొంతమంది ఎవరైనా ఒక పని తలపెడితే, సమర్థించటమో, సహాయపడటమో చేస్తారు కాని అతి తక్కువ మంది తాను నమ్మిన సిద్ధాంతాన్ని కార్యాచరణరూపొందించడానికి తమ సర్వశక్తులూ ధారపోసి జీవితాన్ని లక్ష్యానికి అంకితంచేయగల్గుతారు. అలాంటి అరుదైన కార్యశీలి, ఉద్యమజీవి, కవి, రచయిత డా.నందిని సిధారెడ్డి.

**“మొట్టమొదట**
**నిప్పు పుట్టించిన వాడు కవి**
**మంట పెట్టినవాడు కవి**
**మంటలా భగభగ మండినవాడు కవి**
**రెండు చేతుల్తో భూప్రపంచాన్ని తడిమి చూసినవాడు మహాకవి”**


అంటారు కవిని నిర్వచిస్తూ. అందుకు తానొక ఉదాహరణగా నిలచి చూపారు కూడా. ఇంకా,

‘నిజమైన కవి చావడు
మాటల్లోనే మంటల్లోనే
మౌనాన్ని ప్రక్షాళనం చేసుకుంటాడు’ అని అంటారు.

పేరుకోసమో, పురస్కారం కోసమో కాక తాను చేపట్టిన ఉద్యమం కోసం కవిత్వాన్ని ఆయుధంగా మలచుకున్న కవి సిధారెడ్డి. కడగండ్లను కాడిగా కట్టుకుని, సాటిమనుషుల కడుపునింపే కర్తవ్యపరాయణుడైన రైతుల బతుకు వెతలను కళ్లకు కట్టి చూపిన కవి.

అపరాత్రి ఆపతి ఎవరిదో
పూలు దుఃఖభారాన్ని మోయలేవు
చేనుకు కాపలా వెళ్లిన మనిషి
చెట్టుకు వేలాడితే
కుటుంబమంతా ఎంత చీకటి’
‘ఎటు పక్కకు పొర్లినా
అప్పు పల్లేరుగాయలెక్క గుచ్చుకుంటున్నది’

ఇలాంటి పరిస్థితులే అన్నంపెట్టే అన్నదాత చెట్టుకు వేలాడే పరిస్థితి. మట్టిని నమ్ముకున్నమనుషుల వెతలను తన కవిత్వం నిండా వెలార్చిన ‘భూమి స్వప్నం’ ‘ప్రాణ హిత’,’ఇక్కడి చెట్టు గాలి’ఈ కవి. ‘నారుమళ్లతో కాలువలు మాట్లాడినట్లు’ అంటారొక కవితలో... అలాగే,




మాకున్నవి రెండు చేతులే
మేం నమ్ముకున్నదీ మా రెండు చేతులే
కడుపు కొడితే చూస్తూ ఊరుకున్నాం
రెండు చేతులు కట్టేసి కొడితే
ఎట్లా ఊరుకుంటాం’

రాసిన కలం సిధారెడ్డిదే కావచ్చు, వెతలు, గొంతు మాత్రం పీడిత జనాలదే. అంతగా మమేకమై రాసారు కవితల్ని.

నాగేటి సాల్లల్ల  నా తెలంగాణా
నా తెలంగాణా,
నవ్వేటి  బతుకులు నా తెలంగాణా
నా తెలంగాణా!

ఉద్యమానికి ఊపిరి పోసింది. ఎన్ని వేల గొంతుకలు ఎలుగెత్తి పాడాయో ఆ పాటను. ఆపాట తెలంగాణా సాధన సమరంలో పాశుపతాస్త్రం వంటిది.
అయితే పాటంతా తెలంగాణా పల్లె సంస్కృతి వర్ణనే. ఎవరినీ దూషించటమో, రెచ్చగొట్టటమో అందులో లేదు. అందులో ఉన్నది ఆత్మగౌరవ ప్రసక్తి మాత్రమే. ఇదే పాట తరువాత ఒక సినిమాలో కూడా ఉపయోగిస్తే దానికి నంది అవార్డు వచ్చింది. ప్రసిద్ధ తెలంగాణ దర్శకుడు శంకర్ తీసిన సినిమా 'జై బోలో తెలంగాణా' కు సిధారెడ్డిగారితో బతకమ్మ మీద పాట రాయించుకున్నారు.
ఉద్యమ స్ఫూర్తితో దగా చేసిన వలస నాయకులకు హెచ్చరికగా


**మా మౌనాన్ని ఎప్పుడూ ప్రమత్తతే అనుకుంటావ్**
**కానీ, నీకు తెలుసో తెలియదో,**
**గోడకు వేలాడే తుపాకీ కూడా మౌనంగా ఉంటుంది**

అని తెలంగాణా ఉద్యమాన్ని తలపాగా చుట్టుకున్న కవియోధుడు సిధారెడ్డి. అంత బలంగా ఉంటుంది కవిత్వప-రంగా నిరసన వ్యక్తీకరణ ఈయన కవిత్వంలో.
నందిని సిధారెడ్డి కవిత్వపు కొన్ని మెతుకులే ఇవి అయినా చాలు ఆయన కవిత్వం స్థాయితెలపడానికి. అంతే గాక వ్యాసవిస్తరభీతి కూడా ఉంది. మంజీరా రచయితల సంఘం స్థాపించినా, తెలంగాణా రచయితల వేదిక ఏర్పాటు చేసి ఉద్యమ స్ఫూర్తితో ఊరూరూ తిరిగి 'సోయి' దెచ్చిన కార్యశీలి. మాట ముక్కుసూటితనం కలిగినదైనా, మనసు వెన్నపూసమయం. అర్థం చేసుకున్న వారికి ఆయన ఆర్ద్ర హృదయం కనిపిస్తుంది.

**ఎవరేమనుకున్నా చిటికెన వేలులా**
**జీవించలేను**
**ఎవరు తప్పదన్నా మద్దెల పట్టుకు తిరగలేను**

ఇదీ సిధారెడ్డి వ్యక్తిత్వం.

ఈయన కలం వెలువరించిన పుస్తకాలు 1.భూమిస్వప్నం, 2.సంభాషణ 3.ఆధు నిక తెలుగుకవిత్వం - వాస్తవికత - అధివాస్తవికత(సిద్ధాం-తగ్రంథం), 4.దివిటీ, 5.ప్రాణహిత, 6.ఒక బాధ కాదు,7.నది పుట్టుబడి, 8.ఇగురం, 9.ఆవర్థనం,10.నాగేటి చాలల్ల (పాటలు), 11.ఇక్కడి చెట్ల-గాలి, 12.చిత్రకన్ను (కథాసంపుటి), 13.అనిమేష (దీర్ఘకవిత)-అన్నీ ఆయన జీవనప్రస్థాన ప్రతి-




బింబాలు.
ఇక జీవిత విశేషాలకు వస్తే 2-5-

1954 న సిద్దిపేట జిల్లా, కొండపాక మండలం, బండారం గ్రామంలో జననం. తండ్రి బాలకృష్ణారెడ్డి రజాకార్ల నెదిరించిన కమ్యూనిస్టుయోధుడు. తల్లి రత్నమాల .రైతుకుటుంబం. తెలియకుండానే తండ్రి నుండి ప్రగతిశీల భావాలను వారసత్వంగా గైకొన్నారు. తల్లినుండి శ్రమైకజీవన సౌందర్యాన్ని స్వీకరించారని వారి జీవిత గమనం పరిశీలిస్తే అర్ధమౌతుంది. ఊరిగ్రంథాలయంలోని పుస్తకాలు తెచ్చుకుని చదువుతుంటే చూచి వాళ్ల బాపు అన్నమాట మదిలో పదిలంగా దాచుకుని, ఆ తరువాత అందరూ సెబ్బాస్ అనే విధంగా చేసి చూపించాడు. ఇంతకీ సిధారెడ్డి వాళ్ల బాపు అన్నమాటేమిటంటే- "పుస్తకాలు చదువుడు గాదు, పుస్తకాలు రాస్తే గొప్ప"ఎంత గొప్ప స్ఫూర్తి ఆ బాపు బాలకృష్ణారెడ్డి గారి మాట.

పాఠశాలలో అలాంటి గురువే దొరికారు. అష్టకాల నరసింహరామ శర్మ ఆయనకు సాహిత్యం వైపు దృష్టి పడేటట్లుచేశారు.ఆపైన సిద్ధిపేటలో మిత్రులు బెడిద రాజేశ్వర్, భగవంతరెడ్డి గార్ల సాంగత్యంతో విప్లవ కవిత్వం వైపు దృష్టి మళ్లటం అప్పుడే మిత్రులతో కలిసి 'దివిటీ' అనే కవితా సంపుటి ప్రచురించటం సిధారెడ్డి సాహిత్య జీ-



వితానికి నాంది అనిచెప్పవచ్చు. ఇంటర్మీడియేట్ లో గణితము, విజ్ఞాన శాస్త్రాలు ఐచ్ఛికాలైనా, ఇంజనీరింగు వంటి కోర్సులకు వెళ్లకుండా బి.ఏ, ఆపై ఎం.ఏ.,ఎం. ఫిల్., పిహెచ్.డీ. లు తెలుగు భాషతో చేయటం తెలుగు అధ్యాపకులుగా చేరటం తన మనసు చెప్పిన తోవను ఎంచుకోవడమే. డా.సి.నారాయణరెడ్డి గారికి సిధారెడ్డి అంటే వాత్సల్యం, సిధారెడ్డికి నారాయణరెడ్డి అంటే అభిమానం, గౌరవం. దృక్పథాలు వైనా వారివురి మధ్య సత్సంబంధాలుండటం, సాహిత్యం నేర్పిన సంస్కారం.

సాహిత్యం లో సూర్యుడు అనే అంశంపై సినారె సూచనతో ఎం.ఫిల్. ఆ తరువాత.

ఆ తరువాత ఆయన నేతృత్వంలోనే ఆధునిక కవిత్వంలో వాస్తవికత-అధివాస్తవికత అనేఅంశంపై సిద్ధాంతవ్యాసం సమర్పించి డాక్టరేట్ అవటం ఇదంతా విద్యాపరమైన ప్రగతి.

తెలుగు అధ్యాపకులుగా పనిచేస్తూ మంజీర రచయితల సంఘం ఏర్పాటు చేసి కవులకు స్ఫూర్తి కలిగించింటం తో ఆయన లోని సామాజిక స్పృహ కలిగిన ప్రగతి శీల కార్యశీలి నడుంకట్టాడు. ఆ తరువాత తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో తెలంగాణ రచయితల సంఘం ఏర్పాటు చేసి జిల్లాల వారీ గా సభలు నిర్వహించటం ఆ తరువాత 'సోయి' పత్రిక వెలువరించటం అంచెలంచెలుగా ఆయన ఉద్యమపూరిత కవిత్వాదర్శ ప్రస్థానం,

తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆయనను తెలంగాణా సాహిత్య అకాడమీ

కి తొలి అధ్యక్షునిగా చేయగలిగాయి. ఆయన హయాంలోనే అనిదంపూర్వంగా తెలుగు ప్రపంచ మహాసభలు వైభవోపేతంగా జరిగిన విషయం జగద్విదితం.


తెరవే వేదిక ఏర్పాటైన కొత్తల్లో ఆయనతో పరిచయం ఏర్పడింది. నేను ఆదిలాబాదు జిల్లాలో పనిచేస్తున్నప్పుడు తెరవే కార్యకర్తగా ఉన్నాను.ఆదిలాబాద్ తెరవే సభలో తొట్టతొలి కార్యక్రమ ప్రారంభకునిగా నేను పా-ల్గొనటం మరచిపోలేని విషయం. ఆ తర్వాత ఎన్నోసార్లు కలుసుకోవడం జరిగింది, జరుగుతూ-నే ఉన్నది. ఆయనను చూస్తే నాకు నన్నయ్య ఉదంకోపాఖ్యానంలోని పద్యభాగం గుర్తుకు వస్తుంది. 'నిండు మనంబు నవ్య నవనీత సమానము పల్కు దారుణాఖండల శస్త్ర తుల్యము'-అని.

ప్రతిభ ఉన్న చోటికి ప్రశంసలు పురస్కారాలు పరుగెత్తుకుని వస్తాయి.
అవంటే సిధారెడ్డికి అయిష్టమే అయినా ఆత్మీయతకు, అనుబంధాలకు తలఒగ్గకతప్పదు. అలా వరించిన పురస్కా-రాలు కొన్ని:

1986లో భూమిస్వప్నం కవితాసంపుటికి ఫ్రీవర్స్ ఫ్రంట్ పురస్కారం
1988లో భూమిస్వప్నం కవితాసంపుటికి ఇందూరు భారతి వారి దాశరథి పురస్కారం
2001లో ప్రాణహిత కవితాసంపుటికి తెలుగు విశ్వవిద్యాలయం వారి పురస్కారం
2009లో ఒక బాధకాదు కవితాసంపుటికి విశ్వకళాపీఠం వారి స్నేహనిధి ఉత్తమకవితా పురస్కారం
2010లో 'నాగేటి సాలల్లో నా తెలంగాణా' పాటకు ఉత్తమ గేయ రచయితగా నందిపురస్కారం
2016లో తెలుగు విశ్వవిద్యాలయం నుండి సాహిత్యంలో విశిష్ట పురస్కారం.

అలాగే హోదాలు కూడా కొన్ని లభించాయి.అవి: 2014లో తెలుగు భాషాపాఠ్యపుస్తకాలను సమీక్షించే కమిటీలో నందిని సిధా రెడ్డి సభ్యుడిగా పనిచేశారు.
2015లో రిక్రూట్‌మెంట్ పరీక్షల కోసం సిలబస్‌పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కమిటీకినియమించబడ్డారు.
తెలుగు భాషపై నిరంతర పరిశోధన, విశ్లేషణ, ప్రచురణ, ప్రచారం కోసం 2017, మే 2న ఏర్పడినతెలంగాణా సాహిత్య అకాడమీకి తొలి చైర్మన్‌గా నియమించబడి, 2020 మేవరకు పనిచేశారు.
2017 ఆగస్టులో కాళోజీ నారాయణ రావు అవార్డుకు అర్హులైన ప్రముఖ వ్యక్తిని ఎంపికచేసేందుకు ఒక ప్యానెల్‌కు నేతృత్వం వహించారు.
2017 డిసెంబరు 15 నుండి 19 వరకు హైదరాబాదులో జరిగిన ప్రపంచ తెలుగుమహాసభలకు అకాడెమీ బాధ్యతలు నిర్వర్తించారు.

ముగించే ముందు ఆయనను ఆకాశానికిఎత్తిన పాట పూర్తిగా ఇక్కడ పొందుపరుస్తున్నాను.ఇందులో తెలంగాణ ఆత్మను నిక్షిప్తం చేశారు డా.నందిని సిధారెడ్డిగారు




**నాగేటి సాల్లల్ల నా తెలంగాణా**
**నా తెలంగాణా ,**
**నవ్వేటి బతుకులు నా తెలంగణా**
**నా తెలంగాణా!**

పారేటి నీల్లల్ల పానాదులల్ల ,
పూసేటి పువ్వుల్ల పూనాసలల్ల
కొంగు సాపిన నేల నా తెలంగాణా
నా తెలంగాణా.
పాలు దాపిన తల్లి నా తెలంగాణా
నా తెలంగాణా /నాగేటి /





తంగేడు పువ్వుల్లు తంబాలమంత,
తీరొక్క రంగుల తీరిచ్చిన పువ్వు
తీరొక్క రంగుల్ల తీరిచ్చిన పువ్వు,
బంగారు చీరలు బజారులన్ని
బతుకమ్మ పండుగ నా తెలంగాణా
నా తెలంగాణా,
బంతిపూల తోట నా తెలంగాణా
నా తెలంగాణా /నాగేటి /

వరద గూడు కడితే వానొచ్చనంట
బురద పొలము దున్ని మురిసున్నరంత,
శివుని గుల్లె నీల్లు, చీమలకు షక్కరి, వాన కొరకు
భజన జడ కొప్పు లేసి,
వాగుల్ల వంకల్ల నా తెలంగాణా
నా తెలంగాణా
చూపు రాలిన కండ్లు నా తెలంగాణా
నా తెలంగాణా /నాగేటి /





కొత్త బట్టలు గట్టి కోటి ముచ్చట్లు,
పాల పిట్టల జూసి పడుచు చప్పట్లు,(౨)
పాల పిట్టల జూసి పడుచు చప్పట్లు
జొన్న కర్రల జెండ జోరున్నదేమి,
అలాయ్ బలాయ్ దీసె నా తెలంగాణా నా

తెలంగాణా
దుండి పంచిన ఆర్తి నా తెలంగాణా
నా తెలంగాణా /నాగేటి /




మోట కొట్టే రాత్రి మోగిన పాట,
తాడు పేనిన తండ్రి తలుపుల ఉన్న అప్పు,(౨)
తాడు పేనిన తండ్రి తలుపుల ఉన్న అప్పు
కల్లమూడిసిన అవ్వ కలలోని గింజ(౨)
ఆరు గాలం చెమట నా తెలంగాణా
నా తెలంగాణా
ఆకలి దప్పుల మంట నా తెలంగాణా
నా తెలంగాణా /నాగేటి /

ఊరు కాసె తల్లి ఉరిమి సూడంగ,
బువ్వ లేని తల్లి బోనం వండింది(౨)
బువ్వ లేని తల్లి బోనం వండింది
సేను కొచ్చిన పురుగు సెలిగి పూసింద(౨)
బోనాల పండుగ నా తెలంగాణా
నా తెలంగాణా
కాట్రావుల ఆట నా తెలంగాణా
నా తెలంగాణా /నాగేటి /





గట్టి కట్టిన రోజు డప్పు సప్పుల్లు,
పీరీల గుండంల పిలగాండ్ల ఆట,(౨)
పీరీల గుండంల పిలగాండ్ల ఆట
కుడుక పేర్ల మొక్కు కూలి బతుకుల్లు,
వాలు పాడిన పాట నా తెలంగాణా
నా తెలంగాణా
ఆత్మ గల్ల చెయ్యి నా తెలంగాణా

నా తెలంగాణా /నాగేటి /

కలిసేటి సేతుల్ల కన్నీటి పాట,
సిందోల్ల సిందుల్ల సిగురించె నాట్యం.(2)
సిందోల్ల సిందుల్ల సిగురించె నాట్యం
ఒగ్గు మద్దెల డప్పు వాద్య సంగీతం.(2)
కళలకే పుట్టుక నా తెలంగాణా
నా తెలంగాణా
పాట గాచిన పట్టు నా తెలంగాణా
నా తెలంగాణా /నాగేటి /

బురుజు గోడల పొగరు మెడలు వంచంగ,
గుట్లల్ల సెట్లల్ల
గోగు పువ్వులు(2)
సద్ది మోసిన తల్లి సావు బతుకుల్లు,
ప్రాణమిచ్చిన వీర కథలు పాడంగ(2)
గోరు కొయ్యల పొద్దు నా తెలంగాణా
నా తెలంగాణా
గోరింకలా సభలు నా తెలంగాణా
నా తెలంగాణా /నాగేటి /



ఈ ఒకే పాట మెతుకు చాలు నందిని సిధారెడ్డి తెలంగాణా పల్లెబతుకును ఎంత బిగ్గిత అలుముకున్నడో చెప్పడానికి.

చివరగా మనిషి గురించి తండ్లాడే నిఖార్సైన మనిషి, నిరాడంబరతతో నిజాయితీకి చిరునామా అనదగ్గ సిద్ధిపేట సిధారెడ్డి గురించి అనేక పెద్దలు రాసిన వ్యాసాలసంకలనం ఆయన 44ఏళ్ల సాహిత్య ప్రస్థాన సందర్భంగా అభినందన సంచికగా డా.గంటా జలంధర్ రెడ్డి సంపాదకత్వంలోవెలువడిన 'మందారం' చాలు, బండారం ఊరి పేరుకు కీర్తి తెచ్చిన బంగారుకవి సిధారెడ్డిసాహిత్యకృషిని, వ్యక్తిత్వ విశిష్టతను చాటి చెప్పడానికి. ఆయన మరిన్ని దీప్తకావ్యాలు వెలువరించాలని అభిలషిస్తూ ముగిస్తు న్నాను

# .సంస్కృతసాహిత్యంలో రిపార్టీ కవితా ప్రక్రియ
# ( Repartee in Sanskrit Literature)



చిలకమర్తి దుర్గాప్రసాదరావు

సంస్కృత సాహిత్యం ఆకాశం కంటే విశాలమైంది, సముద్రం కంటే లోతైంది. ఎందుకంటే సంస్కృత సాహిత్యం అన్ని ప్రాచీన సాహిత్య ప్రక్రియలకు నిధి అవడమే కాకుండా అన్ని ఆధునికసాహిత్యప్రక్రియలకు కూడ మాతృకగా కనిపిస్తోంది. అది ప్రాచీనంలో ప్రాచీనం ఆధునికంలో ఆధునికం . ఇక ఆంగ్ల సాహిత్యంలో Repartee అనే ఒక సాహిత్య ప్రక్రియ ఉంది. రిపార్టీ అంటే Ready reply అని A witty reply అని 'Talk characterized by clever and witty replies' అని నిర్వచిస్తారు

సాధారణంగా మానవులలో ఇతరులను ఆక్షేపించే స్వభావం ఎక్కువగా కనిపిస్తుంది. ఏదో వంక పెట్టుకుని ఎక్కడో అక్కడ ఎవరో ఒకరిని ఆక్షేపిస్తూనే ఉంటారు. ఆక్షేపణలు సహించలేని వాళ్ళు తగిన సమాధానం చెబుతూనే ఉంటారు.

ఈ ఆక్షేపణ ముఖ్యంగా మూడు స్థాయిల్లో ఉంటుంది. కొంతమంది వేళాకోళంగా ఇతరులను ఆక్షేపిస్తూ ఉంటారు, వారి మనస్సుల్లో ఎటువంటి చెడు ఉద్దేశం ఉండదు. మరికొంత మంది మనస్సులో ఒకటి పెట్టుకుని ఇతరులను ఆక్షేపిస్తూ ఉంటారు. మరికొంతమంది సూటిగా కఠినంగా ఆక్షేపిస్తారు. ఎవరు ఏస్థాయిలో, ఎంత మోతాదులో, ఏ విధంగా ఆక్షేపిస్తే వారికి ఆ స్థాయిలో అంతే మోతాదులో ఆ విధంగా సమాధానం చెప్పడం Repartee అనుకోవచ్చు. ఈ విధంగా మృదువు, కఠినం, అతికఠినంగా చేసే ఆక్షేపణలు దానికి తగిన సమాధానాలు సంస్కృత సాహిత్యంలో కోకొల్లలు. అవి ఎలా ఉంటాయో స్థాలీపులాక న్యాయంగా కొన్నిటిని పరిశీలిద్దాం. ఆది దంపతులైన పార్వతీ పరమేశ్వరుల చిలిపి సంభాషణలు, వేలాకోలాలు జగత్ప్రసిద్ధాలు. పార్వతి వాస్తవానికి అచలపుత్రికే అయినా చలచిత్తం కలది. చాల చిలిపిది. ఒకనాడు సరదాగా తన భర్తను ఒక ఆటపట్టిద్దామనుకుంది. కాని ఆయన తనకంటే తెలివైన వాడని మాత్రం ఊహించలేక పోయింది పాపం. ఏమండి! నాకు అమ్మ నాన్న ఇద్దరూ ఉన్నారు. నాకున్నట్లుగా మీకు అమ్మానాన్న లెక్కడున్నారో చూపించండి అంది కొంటెగా. శివుడు దానికి సమాధానంగా ఓహో అదా! నాకు అత్తా మామ ఇద్దరూ ఉన్నారు. నాకున్నట్లుగా నీకు అత్తా మామలు ఎక్కడున్నారో చూపించు అన్నాడు నవ్వుతూ. ఏం చూపిస్తుంది? వెంటనే ఉడుక్కుంటూ ముంగమూతి పెట్టి ఆయన ఒడిలోకి వంగి వాలిపోయి ఉంటుందని ఊహిద్దాం. ఈ విధంగా పార్వతి కొంటె ప్రశ్నకు తగిన సమాధానం చెప్పిన ముక్కంటి మాటలు మనల్ని రక్షించుగాక.

## క్వ తిష్ఠత: తే పితరౌ మమేవే త్వప-
## ర్ణయోక్తే పరిహాసపూర్వం
## క్వ వా మమేవ శ్వశురౌ తవేతి తా-
## మీరయన్ సస్మితమీశ్వరోవ్యాత్

ఇప్పుడు ఎంతో స్నేహం గల ఇద్దరు యువతులమధ్య వేళాకోళం (ఆక్షేపణ సమాధానం ) ఎంత అందంగా ఉంటుందో చూద్దాం.

ఒకసారి శివకేశవులిద్దరూ తమ భార్యలతో ఒక చోట సమావేశమయ్యారు. ఒక ప్రదేశంలో శివకేశవులులిద్దరూ కూర్చొని ఏవో మాట్లాడుకుంటున్నారు. మరొక ప్రదేశంలో లక్ష్మీపార్వతులు కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు. పార్వతి లక్ష్మితో ఏమమ్మా! చంచలమైనదానా! నిన్నోమాటడుగుతాను సమాధానం చెబుతావా? అంది . సరే అడగవమ్మా! శివుని పెళ్ళామా! అంది లక్ష్మి . మీనాన్న ఎవరు? అంది పార్వతి . వెంటనే లక్ష్మి సముద్రుడు అని సమాధానం చెప్పింది. వెంటనే పార్వతి ఊరుకోవమ్మా! ఎవరు నమ్ముతారు. నీళ్లకెక్కడైన పిల్లలుపుడతారా! నేను నమ్మను గాక నమ్మను అంది. ఓహో! సరేలే! నువ్వు నమ్మకపోతేమానెయ్యి. పర్వతాలకు పిల్లలు పుట్టగాలేంది సముద్రానికి మాత్రం పిల్లలు పుట్టరా ఏంటి? అంది . అది ఎవరు నమ్ముతారో వాళ్లే ఇది కూడా నమ్ముతారులే అని లక్ష్మి సమాధానం చెప్పింది . నువ్వు పర్వతం కూతురవైనప్పుడు నేను సముద్రం కూతుర్ని ఎందుకు కాకూడదు అని లక్ష్మి సమాధానం లోని అంతరార్థం.

ఈ విధంగా పరస్పరం వేళాకోళాలాడుకుంటున్న లక్ష్మీపార్వతుల సరససల్లాపాలను వింటూ హరిహరులు లోలోపల ఎంతో ఆనందిస్తున్నారట . అటువంటి ఆ శివకేశవుల ఆనందం మన విఘ్నాలు పోగొట్టి మనలను రక్షించుగాక అని ఒక కవి అందమైన శ్లోకం వ్రాశాడు.

## లోలే! బ్రూహి కపాలికామిని ! పితాకస్తే? పతి: పాథసాం
## క: ప్రత్యేతి జలాదపత్యజననం? ప్రత్యేతి య: ప్రస్తరాత్
## ఇత్థం పార్వతిసింధురాజసుతయోరాకర్ణ్యవాక్చాతురీం
## సంస్మేరస్య హరేర్హరస్య చ ముదో నిఘ్నంతు విఘ్నం తు వ:

ఇవి కేవల వేలాకోలపు మాటలు వానికి తగిన సమాధానాలు. ఇపుడు కొంచెం మోతాదు మించిన ఆక్షేపణలు దానికి తగిన సమాధానాలు ఎలా ఉంటాయో తెలుసుకుందాం

మనం ఎంత గొప్ప వాళ్లమైనా కావొచ్చు గాని ఇతరుల్ని కించపరిస్తే అది మనకు ముప్పు తెచ్చి పెడుతుంది. ఒక్కొక్కప్పుడు మన అస్తిత్వానికే ప్రమాదం తెచ్చి పెడుతుంది. ఆత్మశ్లాఘ ఎంత ప్రమాదమో పరనింద అంతకంటే ఎక్కువ ప్రమాదం. అందువల్ల మనం ఎంత ఉన్నతంగా ఉన్నామో అంత అణకువగా కూడ ఉండడం నేర్చుకోవాలి. లేకపోతే సమాజమే మనకి గొప్ప గుణ పాఠం చెబుతుంది. ఇతరుల్ని కించపరిస్తే కల్గే నష్టాన్ని ఒక సంస్కృత కవి ఎంత చక్కగా వివరించాడో స్వయంగా చూడండి.

ఒకరోజు లక్ష్మి వైకుంఠం నుంచి బయలుదేరి కైలాసంలో ఉన్న పార్వతి ఇంటికి వెళ్లింది. పార్వతి, ఇంటికి వచ్చిన అతిథిని సాదరంగా ఆహ్వానించి కూర్చోబెట్టింది. లక్ష్మి ఆ పరిసరాలన్నీ పరికించింది. పార్వతికి లక్ష్మికున్నంత ఐశ్వర్యం లేదు, డాబు లేదు. పరిసరాలన్నీ సామాన్యంగా ఉన్నాయి. లక్ష్మికి అనుకోకుండా పార్వతిని ఓ ఆట పట్టించాలనే ఆలోచన కల్గింది.

**"భిక్షార్థీ స క్వ యాత:?"** అని చిన్న ప్రశ్న వేసింది. మీ ఆయన ఎక్కడికెళ్లాడమ్మా అంటే బాగుండేది కాని లక్ష్మి అలా అనలేదు. ఆ ముష్టివాడు ఎక్కడికెళ్లాడమ్మా? అంది. శివుడు ఆది భిక్షువు కదా! లక్ష్మి ఆ విషయాన్ని ఎత్తిపొడుస్తూ వెటకారంగా మాట్లాడింది. పార్వతి కి ఈ ప్రశ్న చాల బాధ కల్గించింది. ఏ ఆడదైనా తనను ఎన్నన్నా సహిస్తుందిగాని తన భర్తను నిందిస్తే ఏమాత్రం సహించలేదు కదా! కాని ఏంచేస్తుంది. ఇంటికి వచ్చిన అతిథిని మందలిస్తే బాగుండదు. అలాగని సరిపెట్టుకుని ఊరుకోనూలేదు. ఏదో సమాధానం చెప్పాలి. ఏం చెప్పాలి? కొంచెం ఆలోచించింది.

**"సుతను బలిమఖే"** అంది. 'బలిచక్రవర్తి చేస్తున్న యాగం దగ్గరకు వెళ్లారమ్మా! అని సమాధానం. ఆ సమాధానం వినేసరికి లక్ష్మికి తలతిరిగి పోయింది. బలి దగ్గరకు వెళ్లిన ముష్టివాడు తనభర్త శ్రీమహావిష్ణువు. వామనావతారంలో ఆయన బలిచక్రవర్తిని మూడడుగులు నేల అడగడం లోకవిదితమే. 'మా ఆయనే కాదు మీ ఆయన కూడా ముష్టివాడే, మా ఆయనకన్నా మీ ఆయనే దారుణం. కేవలం మూడడుగుల నేలకోసం ముష్టివాడయ్యాడు' అనే భావం పార్వతి మాటల్లో తొంగి చూసింది. లక్ష్మి కొంతసేపటికి ఎలాగో తేరుకుంది. మళ్లీ ఏదోవిధంగా పార్వతిని ఉడికించాలని సమాయత్తమయింది. రెండో ప్రశ్న వేసింది.

**తాండవం క్వాద్య భద్రే!** అనడిగింది. అమ్మా! మీ ఆయన ఈ రోజు నాట్యం ఎక్కడ చేస్తాడు? అని దానర్థం. మీ ఆయన ఏ పని పాట లేకుండా దిగంబరంగా నాట్యం చేస్తుంటాడని లక్ష్మి మాటల్లోని అంతరార్థం. అప్పటికే ఆరితేరిన పార్వతి వెంటనే అందుకుంది.

**మన్యే బృందావనాంతే** అంది. బృందావనంలో అనుకుంటున్నానమ్మా! అని ఆ మాటలకర్థం. బృందావనంలో నాట్యం చేసే ప్రబుద్ధుడు కృష్ణుడు, శివుడు కాదు. 'మా ఆయనే కాదు మీఆయన కూడ నాట్యం చేస్తాడు. ఎటొచ్చీ మా ఆయన ఒంటరిగా నాట్యం చేస్తాడు అంతే గాని మీ ఆయన లాగ అందరి ఆడవాళ్లను వెంటేసుకుని నాట్యం చెయ్యడు' అని సమాధానం. పార్వతి సమాధానం ఇంత పదునుగా ఉంటుందని లక్ష్మి ఊహించలేదు. ఆమెకు మతిపోయినంత పనయింది. ఏలాగో సంబాళించుకుంది. ఈ సారి తనకు ఇబ్బంది లేని విధంగా మాట్లాడాలనుకుంది.

**క్వనుచ మృగ శిశు:?** అని మరో ప్రశ్న వేసింది. మీ ఏనుగు మొగంవాడు ఎక్కడమ్మా? అని అర్థం. లక్ష్మి కొడుకు మన్మథుడు చాల అందగాడు. పార్వతి కొడుకు వినాయకుడు ఎంత అందగాడో వివరించి చెప్పనవసరంలేదు. 'మా అబ్బాయి చాల అందగాడు మీ అబ్బాయి మాత్రం కురూపి'

అని లక్ష్మి ఆక్షేపణలోని అభిప్రాయం. పార్వతి చాల నొచ్చుకుంది. కాకి పిల్ల కాకికి ముద్దన్నట్లు ఎవరిపిల్లలు వాళ్లకు ముద్దు. పార్వతి మెదడులో ఒక ఆలోచన తళుక్కుమని మెరిసింది. వెంటనే అంది.

"నైవ జానే వరాహం" అని "ఇక్కడేదో పంది తిరుగుతూ ఉంటే దానివెంట వెళ్లాడమ్మా! ఎక్కడున్నాడో తెలీదు" అంది. మా అబ్బాయిది ఏనుగు ముఖమేగాని మీ ఆయన పూర్తిగా వరాహావతారమే సుమా! అని పార్వతి సమాధానం లోని చమత్కారం. ఇది లక్ష్మికి దిగ్భ్రాంతి కల్గించింది. కొంతసేపటికి ఎలాగో తేరుకుంది. ఈసారి జాగ్రత్తగా తనకు ఎదురుదెబ్బ తగలని విధంగ పార్వతికి దెబ్బకొట్టాలనుకుంది. అటు ఇటు కాసేపు చూసింది.

బాలే! కచ్చిన్న దృష్ట: జరఠ వృషపతి:? అనడిగింది. 'మీ వాహనం, అదే ఆ ముసలి ఎద్దు ఎక్కడా కనబడడం లేదేమిటమ్మా!' అని ప్రశ్న. మాది గరుడ వాహనం విమానాల్లో వలే ఆకాశంలో తిరుగుతాం. మీరు నేలపై తిరుగుతారు. మీ వాహనం ముసలి ఎద్దు. అది కదల్లేదు మెదల్లేదు' అని ఆక్షేపం. మేం పై స్థాయి వాళ్లం మీరు నేలబారు మనుషులు అని వెక్కిరింపు. ఆ వెక్కిరింపు అర్థం చేసుకోలేనంత అమాయకురాలు కాదు పార్వతి. అందుకే వెంటనే అందుకుంది.

"గోప ఏవాస్య వేత్తా" అంది. 'ఆవులసంగతి ఎద్దులసంగతి గోవుల్ని కాసేవాణ్ణి అడిగితే తెలుస్తుంది గాని నన్నడిగితే ఏం లాభమమ్మా? పో మీఆయనన్నే అడుగు' అని చిన్న చురక అంటించింది. మా ఆయన నడిపే వాహనాన్ని మీ ఆయన మేపుతాడు. మీకంటే మేమే ఎక్కువ అని పార్వతి ఆంతర్యం. ఈ సమాధానానికి లక్ష్మి పూర్తిగా అవాక్కయింది. తిన్నగా జారుకుంది.

నిజానికి ఇదంతా వారిద్దరి మధ్య వేళాకోళంగా జరిగిన సంభాషణ. ఇందులో నిందగాని వెక్కిరింపుగాని ఏమాత్రంలేవు. ఇతరులను అవమానపరిస్తే అది మనకు ప్రమాదాన్ని తెచ్చిపెడుతుందనే సత్యాన్ని చెప్పడానికే ఒక కవి లక్ష్మీపార్వతులను పాత్రలుగా చేసుకుని ఈ సన్నివేశాన్ని కల్పించాడు. ఇందులో నీతి ముఖ్యం గాని ప్రశ్నలు సమాధానాలు ముఖ్యం కాదు. వారిరువురి మధ్య జరిగిన ఈ సరసమైన సంభాషణ

**భిక్షార్థీ స క్వ యాత: ?సుతను బలిమఖే తాండవం క్వాద్య భద్రే ?**
**మన్యే బృందావనాంతే క్వను చ మృగశిశు:? నైవ జానే వరాహం**
**బాలే కచ్చిన్న దృష్ట: జరఠవృష పతి:? గోప ఏవాస్య వేత్తా**
**లీలాసంలాపఇత్థం జలనిధిహిమవత్కన్యయో: త్రాయతాం న :**

మనందరిని రక్షించుగాక అని చమత్కరించాడోకవి. ఇంత సరసమైన భావాన్ని తనలో దాచుకున్న ఈ శ్లోకం చదవండి.

పెళ్లంటే కొంతమందికి నూతేళ్ల పంట. మరి కొంతమందికి నూతేళ్ల వంట. ఇంకా కొంతమందికి నూతేళ్ల పెంట. ఒకాయన తన స్నేహితునితో ' ఒరేయ్! నేను ఇంటికి వెళ్లే దాక నా భార్యాపిల్లలు భోజనమే చెయ్యరు' అన్నాడట. ఆ స్నేహి-

తుడు చాలసంబరపడిపోతూ, 'అబ్బా! నువ్వంటే నీ భార్యా పిల్లలకు ఎంత ప్రేమరా! నువ్వు నిజంగా చాల అదృష్ట వంతుడివి' అని మెచ్చుకున్నాడట. వెంటనే వాడు ప్రేమాకాదు దోమాకాదు. ఇంటికెళ్లి నేనే వంటచెయ్యాలి' అన్నాడట తాపీగా. నిజానికి మానవ జీవితానికి వంటకి అవినాభావ సంబంధం ఉంది. కాబట్టి ఎంతటి బంగారు పళ్లేనికైనా గోడచేర్పు ఎలా అవసరమో ఎంతటి గొప్పమగాడికైనా వంట నేర్పు కూడ అంతే అవసరం.

ఒక విధంగా ఆలోచిస్తే దమయంతి ఇంద్రాది దేవతలందర్నీ త్రోసిరాజని సామాన్యుడైన నలమహారాజునే పెళ్లి చేసుకోడానికి, అలాగే ద్రౌపది పాండవుల్లో అందరికంటే భీముణ్ణే ఎక్కువగా ఇష్ట పడడానికి కారణం వారికి గల పాకశాస్త్ర ప్రావీణ్యమే అని అనిపించక మానదు. ఏది ఏమైన she లో he ఒదిగి నట్లుగా woman లో man ఒదిగినట్లుగా వంటపనిలో పురుషుడు భార్య వెనుక ఒదిగే ఉంటున్నాడు. వంట చెయ్యనంటే జీవితంలో మిగిలేది పెంటే.

వంట పేరుతో తమ జీవితాల్ని పెంట పాలు చేసుకున్న ఒక జంట మధ్య జరిగిన వాగ్వివాదం ఇక్కడ పొందుపరచ బడింది. సరదాగా చదువుకుని ఆనందించండి. ఇది చదివేక వంటరాని వారు కొద్దో గొప్పో వంట నేర్చుకోండి. కనీసం వంటచేసేవారికి సహాయసహకారాలు అందజెయ్యండి.

ఒకాయన పాపం ఎప్పుడూ ఇంట్లో ఆయనే వంట చేసేవాడు. అనుకోకుండా ఒకరోజు పొరుగూరు వెడుతూ ఆపని భార్యకు పురమాయించాడు. ఆమె అయిష్టంగానే తలూపింది

తిరిగి తిరిగి ఎప్పటికో ఇంటికి చేరుకున్నాడు. కడుపు నకనక లాడుతోంది. వంటచేశావా? అన్నాడు. వెంటనే 'నో' అంది. అసలే ఆకలితో ఉన్నాడేమో ఒళ్లు మండి పోయింది.

పాపాత్మురాలా! వంట ఎందుకు చెయ్యలేదే ? అన్నాడు.

ఏంటి నేను పాపాత్మురాలనా! కాదు మీనాన్నే పాపాత్ముడు అంది.

ఏమే తప్పుడుదానా ఏంటి వాగుతున్నావు అన్నాడు.

ఆ పదం మీఅమ్మకి మీచెల్లి కి వర్తిస్తుంది నాక్కాదు అంది.

వెంటనే ఈ ఇంట్లోంచి బయటికి పోవే అన్నాడు .

ఇది నీ ఇల్లు కాదు పొమ్మనడానికి నీకు హక్కు లేదంది.

భగవంతుడా! నాకు కనీసం చావునైన ప్రసాదించవయ్యా అన్నాడు .

ఆవిడ కూడ తక్కువదేమీకాదు. 'మీలో తప్పుంటే మీరు పోతారు నాలో తప్పుంటే నా మాంగళ్యం పోతుంది' అనేంతటి గొప్ప ఇల్లాలు. అందుకే ఏమీ తడుముకోకుండా నాకంత అదృష్టమా అంది. ఇంతటి భీకరమైన వాగ్వివాదం తనలో పొందుపరచుకున్న ఈ మనోహర శ్లోకం చదవండి.

**ఆ : పాకం న కరోషి పాపిని? కథం పాపీ త్వదీయ: పితా**
**రండే జల్పసి కిం? తవైవ జననీ రండా త్వదీయా స్వసా**
**నిర్గచ్ఛ త్వరితం గృహాద్బహిరితో నేదం త్వదీయం గృహం**
**హాహా ! నాథ ! మమాద్య దేహి మరణం తావన్న భాగ్యోదయ:**


కాబట్టి ఇతరులతో మాట్లాడేటప్పుడు వారిమనస్సు నొచ్చుకోకుండా మాట్లాడగలగడం ఒక కళ. అది అందరు నేర్చుకోవాలి.



# నైవేద్యం

వ్యాకరణం లక్ష్మీదేవి

పిల్లలూ దేవుడూ నైవేద్యం ఎలా తీసుకుంటాడు అన్నదానిమీద కథ చెపుతాను పూర్వం ఒక గురువుగారి దగ్గర కొంతమంది శిష్యులు చదువుకుంటూ వుండేవారు ఒకరోజు వారిలో ఒక పిల్లవాడికి ఒక సందేహం వచ్చింది అదేమిటంటే గురువుగారు దేవుడు మనం పెట్టిన నైవేద్యం తింటాడా తింటే పెట్టిన పదార్థం పెట్టినట్లుగా వుంటున్నది ఎందుకు కొంచమన్నా అయిపోవటం లేదు అని అడిగాడు .గురువు గారు ఏమి సమాధానం ఇవ్వకుండా పాఠాలు చెప్పసాగారు .ఆరోజు పాఠం . ఓం పూర్ణ మదహ పూర్ణ మిదం పుర్ణాత్ పుర్ణముడచ్యతే పూర్ణస్య పుర్ణమాడాయ పుర్ణమేవాచ సిష్యతే .అనే శ్లోకం .పాఠం చెప్పటం పూర్తయిన పిదప అందరినీ ఆపుస్తకం చూసి శ్లోకాన్ని.నోటికోవచ్చేట్లు నేర్చుకోమని చెప్పారు .కొద్దిసేపటి తర్వాత నైవేద్యం గూర్చి ప్రశ్నించిన శిష్యుడి దగ్గరకు వెళ్ళి. నేర్చుకున్నా వా అని అడిగారు .నేర్చుకున్నాను అని వెంటనే అప్పజెప్పాడు శిష్యుడు. శ్లోకం సరిగా చెప్పినప్పటికీ గురువు గారు.తల అడ్డంగా ఊపా రు దానికి ప్రతిగా శిష్యుడు కావాలంటే పుస్తకం చూడండి అని గురువు గారికి పుస్తకం తెరిచి చూపించాడు శ్లోకం పుస్తకం లోనే వుందిగా నీకు శ్లోకం ఎలా వచ్చింది అని అడిగారు గురువుగారు శిష్యుడికి ఏమి చెప్పాలో



తెలియ లేదు గురువుగారు మళ్ళీ అన్నారు పుస్తకంలో వుండే శ్లోకం స్థూల స్థితిలో ఉన్నది.స్థూల స్థితి అంటే కంటికి కనిపించే ది సూక్ష్మ స్థితి అంటే కంటికి కనిపించని ది .నువ్వు చదివినపుడు నీ బుర్ర లోకి అది సూక్ష్మ స్థితి లో ప్రవేశించింది అదే స్థితిలో నీ మనస్సులో ను ఉన్నది అంతేకాదు నువ్వు చదివి నేర్చుకోవటం వల్ల పుస్తకం లో స్థూల స్థితిలో వున్న శ్లోకానికి ఎటువంటి తరుగు జరగలేదు. అదేవిధంగా విశ్వమంతా వ్యాప్తి అయి ఉన్న పరమాత్ముడు నైవేద్యాన్ని సూక్ష్మ స్థితిలో గ్రహించి స్థూల రూపం లో ఎటువంటి నష్టం లేకుండా చేస్తాడు దాన్నే మనం ప్రసాదంగా తీసుకుంటున్నాం అని వివరించారు గురువుగారు పిల్లలూ ఇప్పుడు మీకు కూడా అర్థమైంది అనుకుంటాను దేవుడు నైవేద్యం ఎట్లా స్వీకరిస్తాడు అని కథ కంచికి. మనం ఇంటికి

ublished, Edited and Printed by T Shanti at Flat No. 45058, Janapriya Utopia, Hyderguda,
ttapur, Hyderabad-500048. Phone 9490571297 email: teega51@gmail.com ,
ww.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-500001.








# సంక్షేమంలో సువర్ణాధ్యాయం

ఎనిమిదేండ్ల
ప్రగతి ప్రస్థానం





## సంక్షేమంలో నంబర్ వన్

- వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు రూ.2016, దివ్యాంగులకు రూ.3016, బీడీ కార్మికులకు, బోదకాలు బాధితులకు రూ.2016 చొప్పున ఆసరా పెన్షన్లను ప్రతినెలా అందిస్తున్న ఏకైక రాష్ట్రం
- రాష్ట్ర వ్యాప్తంగా 36.32 లక్షల మందికి ఆసరా పెన్షన్లు అందుతున్నాయి
- కల్యాణలక్ష్మి / షాదీ ముబారక్ ద్వారా పేద ఆడపిల్ల పెండ్లి ఖర్చుల కోసం రూ.1,00,116 అందిస్తున్న ఏకైక రాష్ట్రం.
- ఇప్పటి వరకు 11,44,000 మంది ఆడపిల్లలకు లబ్ది చేకూరింది

## పేదల ఆత్మగౌరవ నివాసాలు

- పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఉచితంగా నిర్మించి ఇస్తున్న ఏకైక రాష్ట్రం. స్వంతస్థలం కలిగిన వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షలు దశలవారీగా మంజూరు చేస్తున్నది.



ఎనిమిదేండ్ల
ప్రగతి ప్రస్థానం









## వృత్తి పనుల వారికి ప్రోత్సాహం

- ప్రభుత్వం గొల్లకుర్మలకు భారీ ఎత్తున గొర్రెల పంపిణీ చేస్తున్నది. రూ.11 వేల కోట్లతో 7.3 లక్షల యూనిట్ల పంపిణీ లక్ష్యంగా నిర్ణయించింది
- మత్స్యకారుల కోసం అన్ని జలాశయాల్లో చేపల పెంపకం చేపట్టింది. ఇప్పటివరకూ 10.17 లక్షల మందికి రూ.305 కోట్లతో చేపపిల్లలు పంపిణీ చేసింది. ఎనిమిదేళ్ళలో రూ.25,782 కోట్ల మత్స్య సంపద సృష్టించబడింది
- గౌడ సోదరుల సంక్షేమం కోసం హైదరాబాద్ లో మూసేసిన కల్లు దుకాణాలను పునరుద్ధరించింది. పాతబకాయిలతో సహా చెట్ల పన్నును రద్దుచేసింది. మద్యం దుకాణాల లైసెన్సుల్లో 15% రిజర్వేషన్ ఇచ్చింది.
- నేతన్నలకు రూ.5 లక్షల బీమా కల్పిస్తూ ప్రీమియం చెల్లించాలని నిర్ణయించింది. నూలు రసాయనాల పై 50% సబ్సిడీ ఇస్తున్నది.
- సర్వమతాలను గౌరవిస్తూ బతుకమ్మ, బోనాలు, రంజాన్, క్రిస్మస్‌ను అధికారికంగా నిర్వహిస్తున్నది. నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్నది. ఇమాం, మౌజమ్‌ల కు రూ. 5 వేల చొప్పున గౌరవ వేతనం అందిస్తున్నది.
- అన్ని సామాజిక వర్గాలకు హైదరాబాద్‌లో కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తున్నది.
- ప్రభుత్వ ఉద్యోగాల్లో 95% స్థానికులకే ఇస్తున్న ఏకైక రాష్ట్రం. 8 సం.లలో 1 లక్షా 33 వేల ఉద్యోగాలు భర్తీ చేసి, ప్రస్తుతం ప్రభుత్వం మరో లక్ష ఉద్యోగాల నియామకం చేపట్టింది.

## దేశానికే దిక్సూచి దళితబంధు

**దళితుల స్వావలంబన, సమగ్రఅభ్యున్నతి లక్ష్యంగా ప్రవేశపెట్టిన విప్లవాత్మక పథకం. ప్రపంచంలోనే అతి పెద్ద నగదు బదిలీ పథకం.**

- ప్రతి దళిత కుటుంబానికి రూ.10 లక్షలు గ్రాంటుగా ఇస్తుంది. బ్యాంకు లింకేజీ లేదు.
- తిరిగి చెల్లించవలసిన అవసరం లేదు.
- అనుకోని ఆపదల నుండి లబ్ధిదారులను కాపాడేందుకు దళిత రక్షణ నిధి ఏర్పాటు చేసింది .
- ప్రభుత్వ లైసెన్సుల ద్వారా పొందే కాంట్రాక్టులు, వైన్ షాప్, తదితర వ్యాపారాలలో దళితులకు 10 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నది. ఫలితంగా ఈ సంవత్సరం 262 వైన్ షాప్ లైసెన్సులు దళితులకు లభించాయి.
- 2021-22లో దాదాపు 40 వేల కుటుంబాలకు రూ.4 వేల కోట్ల లబ్ది చేకూరింది. 2022-23లో 1 లక్షా 75 వేల కుటుంబాలకు రూ.17,700 కోట్ల అందించనుంది.








## విద్యారంగంలో వినూత్న వికాసం

- దేశంలోనే 978 అత్యధిక గురుకుల విద్యాలయాలు కలిగిన ఏకైక రాష్ట్రం. వీటిలో 5 లక్షల మంది విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధన జరుగుతున్నది.
- ఒక్కో విద్యార్థి పై సాలీనా రూ.1 లక్ష 25 వేలు ఖర్చు చేస్తున్నది
- అన్ని రకాల విద్యాలయాల్లో, హాస్టళ్లలో సన్నబియ్యంతో భోజనం పెడుతూ, ఉచితంగా యూనిఫాం, పుస్తకాలు అందిస్తున్నది

## మన ఊరు - మన బడి

- ఈ కార్యక్రమం కింద రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో బోధనతో పాటూ దశలవారీగా మౌలిక వసతుల కల్పన కోసం రూ.7,289 కోట్లు కేటాయించింది.





## అత్యుత్తమ వైద్యసేవలు

- హైదరాబాద్‌కు నలువైపులా టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ఏర్పాటులో భాగంగా గచ్చిబౌలిలో ఆసుపత్రి సేవలందిస్తున్నది. అల్వాల్,సనత్ నగర్, ఎల్‌బీ నగర్‌లో త్వరలో ఏర్పాటవుతున్నాయి.
- ప్రతి జిల్లాకు ఒక ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తున్నది. వరంగల్‌లో హెల్త్ సిటీ ఏర్పాటులో భాగంగా రూ.1100 కోట్లతో 2వేల పడకలతో 24 అంతస్తుల మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని కొత్తగా నిర్మిస్తున్నది.
- 'కంటి వెలుగు' ద్వారా 1.5 కోట్ల మందికి కంటి పరీక్షలు చేసి, 41 లక్షల కంటి అద్దాలను పంపిణీ చేసిన ఏకైక రాష్ట్రం.
- హైదరాబాద్‌లో 350 బస్తీ దవాఖానాలను ప్రభుత్వం మంజూరు చేసింది. 256 దవాఖానాలు ఇప్పటికే సేవలందిస్తున్నాయి.
- ప్రభుత్వ హాస్పిటళ్ళలో 56 వేల ఆక్సిజన్ బెడ్లు ఏర్పాటుచేసింది.
- ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించిన మహిళకు ఆడశిశువైతే రూ.13 వేలు, మగశిశువైతే రూ.12 వేలతో పాటు, 16 వస్తువులున్న ప్రత్యేక కిట్ ను 'కెసిఆర్ కిట్' పథకం ద్వారా అందజేస్తున్నది
- ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 13 లక్షల 30 మందికి లబ్ది చేకూరింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య 30 నుండి 56 శాతానికి పెరిగింది.

**తెలంగాణ ఆచరిస్తున్నది.. దేశం అనుసరిస్తున్నది**

జారీ చేసిన వారు: కమీషనర్, పౌరసంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం